


Truth of News

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మహ్మద్ షఫీ అహ్మద్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శుక్రవారం, 13 సెప్టెంబర్ 2024 | విజయవాడ | సంపుటి: 01 - సంచిక : 94 | పేజీలు : 08 వెల రూ.6.50

Published from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


## గణపతి పూజలో ప్రధాని మోడీ

- ఆందోళనలో సుప్రీంకోర్టు న్యాయవాదులు



**న్యూఢిల్లీ-సూర్య వాస్తవం:** న్యూఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నివాసంలో నిర్వహించిన గణపతి పూజకు ప్రధాని నరేంద్ర మోడీ హాజరయ్యారు. మోడీకి ప్రధాన న్యాయమూర్తి, ఆయన భార్య కల్పనాదాస్ స్వాగతం పలికారు. గణపతి పూజ కోసం డివై చంద్రచూడ్ నివాసానికి ప్రధానమంత్రి రావడంపై శివసేన (యుబిటి) నాయకులు, సీనియర్ సుప్రీంకోర్టు న్యాయవాదులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది న్యాయవ్యవస్థ పారదర్శకతపై ప్రభావం చూపుతుందని అన్నారు. రాజకీయ నాయకులను "రాజ్యాంగ పరిరక్షకుడు" కలవడం ప్రజల మనస్సులలో సందేహాలను రేకెత్తిస్తుందని శివసేన ఎంపి సంజరు రౌత్ ఎక్స్ లో ట్వీట్ చేశారు. ఏక్‌నాథ్ షిండే నేతఅత్వంలోని వర్గాన్ని నిజమైన శివసేనగా గుర్తించాలన్న మహారాష్ట్ర స్పీకర్ నిర్ణయాన్ని ఉద్ధవ్ ఠాక్రే శిబిరం సవాలు చేసిన కేసు సీజేఐ చంద్రచూడ్ ముందు విచారణ జరుగుతోంది. ఈ కేసులో ప్రధానమంత్రి ఇతర పక్షంగా ఉన్నందున తమకు న్యాయం జరుగుతుందా? అన్న సందేహం కలుగుతోంది. ఈ కేసు విచారణ నుంచి దూరంగా ఉండాలని చంద్రచూడ్‌కు రౌత్ సూచించారు. శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది కూడా న్యాయవ్యవస్థపై విరుచుకుపడ్డారు.

# రైతులను ముంచింది..
# గత పాలకులే..!

❖ ఎకరాకు రూ.25 వేలు పరిహారమివ్వాలి ❖ ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి
❖ కాకినాడ జిల్లాలో నీట మునిగిన పంటల పరిశీలన

**కాకినాడ-సూర్య వాస్తవం**



వరదల వలన సర్వం కోల్పోయి నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం ఇస్తున్న ఎకరాకు రూ.10 వేలు కాకుండా రూ.25 వేల పరిహారం తక్షణం ఇవ్వాలని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైయస్సార్ షర్మిలా రెడ్డి చేశారు.కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం కంద్రుకోటలో ఆమె నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె బాధిత రైతులతో మాట్లాడి వారి సాధక,బాధలను తెలుసుకున్నారు. ఏలేరు వరదల వలన పూర్తిగా నష్టపోయామని రైతులు ఈ సందర్భంగా ఆమెకు వివరించారు. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్లనే ప్రతి సంవత్సరం వరదల వలన భారీ నష్టాలకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా షర్మిలా రెడ్డి మాట్లాడుతూ ఏలేరు ఆధునీకరణపై వైఎస్ఆర్ కున్న చిత్తశుద్ధి బాబు,జగన్ లకు లేదని తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఏలేరు రైతులను నిండా ముంచింది గత పాలకులే అన్నారు. వేల ఎకరాలు నీట మునిగాయి దీనికి కారణం రాష్ట్ర ప్రభుత్వాలే అన్నారు.ఏలేరు మరమ్మత్తుల మీద ఎవరు దృష్టి పెట్టలేదని ఆరోపించారు. మరమత్తులు లేక రైతులు దారుణంగా నష్టపోయారన్నారు. ఒక్కో రైతు ఇప్పటి వరకు రూ.30 వేల వరకు పెట్టుబడి నష్టపోయారని, పెట్టిన పెట్టుబడి మొత్తం వరదపాలు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నష్టానికి ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. దివంగత వైఎస్ఆర్ హయాంలో ఏలేరు ఆధునీకరణ పనులు చేపట్టారని గుర్తు చేశారు.రూ.135 కోట్లు కూడా విడుదల చేసి పనులు కూడా మొదలు పెట్టారని తెలిపారు. వైఎస్ఆర్ చనిపోయాక ఏలేరు ఆధునీకరణపై ఎవరూ దృష్టి పెట్టలేదన్నారు. ఇప్పుడు బాబు జగన్ తప్పిదమే అంటున్నాడని, జగన్ ఏమో బాబు తప్పిదం అంటున్నారన్నారు. బాబు హయాంలో ఆధునీకరణ పనులు ఎందుకు చేయలేదని ఈ సందర్భంగా ఆమె ప్రశ్నించారు. గత 10 ఏళ్లుగా ఏలేరు ఆధునీకరణ పై ఇద్దరికీ పట్టింపు లేదన్నారు. జగన్ హయాంలో ప్రాజెక్టులను గాలికి

- మిగతా 2లో..

## దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతింది

- ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది
- ఎన్నికల ఫలితాలు దానికి జీవం పోశాయి
- చిల్లిగవ్వ లేకుండానే బరిలో దిగాము
- రాజ్యాంగాన్ని మోడీ ధ్వంసం చేశారు
- ఇప్పుడు ఆయన ఆట కట్టింది
- రిజర్వేషన్లపై నా వ్యాఖ్యలను వక్రీకరించారు
- వాషింగ్టన్‌లో పాత్రికేయులతో రాహుల్




**వాషింగ్టన్ -సూర్య వాస్తవం:** గడచిన పది సంవత్సరాలుగా దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతిన్నదని, ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. 'మహారాష్ట్రలో

- మిగతా 2లో..

## భాకరాపేట ఘాట్ రోడ్డులో
# ఘోర ప్రమాదం

❖ అదుపుతప్పి కారుపై పడిన కంటైనర్..
❖ ముగ్గురు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు..
❖ మృతులు కర్ణాటక వాసులుగా గుర్తింపు



**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా చంద్రగిరి మండల పరిధిలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. తిరుపతి, మదనపల్లె జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్ రోడ్డులో టమాటో లోడుతో వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కారుపై పడడంతో ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు కర్ణాటక వాసులుగా గుర్తించారు. సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ అనిత వివరాల మేరకు.. కలకడ నుంచి ఓ భారీ కంటైనర్ టమోటాల లోడుతో చెన్నైకి బయలుదేరింది. మరోవైపు కర్ణాటక చెందిన శ్రీవారి భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుపతి, పీలేరు మీదుగా కర్ణాటకకు బయలుదేరారు. తిరుపతి – మదనపల్లె జాతీయ రహదారిలో భాకరాపేట ఘాట్ రోడ్డులో వెళ్తుండగా టమోటా లోడుతో వెళు _న్న కంటైనర్

- మిగతా 2లో..

## కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి

- పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి



**విజయవాడ-సూర్య వాస్తవం**

ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తో విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్లో సమావేశమై జిల్లాకు సంబంధించిన పలు అంశాలకు సంబంధించి చర్చించినట్లు ప్రకాశం జిల్లా నూతన అధ్యక్షులు నియమిం పబడిన షేక్ సైదా తెలిపారు. ....ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆమె దిశ నిర్దేశం చేసారని, అలాగే జిల్లాలో పార్టీ సంస్థాగత నిర్మాణం పై దృష్టి సారించాలని ఆమె ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో నెలకొన్న సమస్యలపై చర్చ జరిగినట్లు ఆయన తెలిపారు, ప్రధానంగా వెలుగొండ ప్రాజెక్టు సత్వర నిర్మాణం పూర్తి మూతబడిన జిల్లా పాలపాడి కేంద్ర తిరిగి తెరిపించటం, అలాగే మార్కాపూరం కేంద్రంగా పశ్చిమ ప్రకాశం జిల్లా ఏర్పాటు చేయడం, జిల్లాలో తాగునీరు

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలో ని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి



## భాకరాపేట ఘాట్ రోడ్డులో ఘోర ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

అదుపుతప్పి ఎదురుగా వస్తున్న కర్ణాటక భక్తుల కారుపై పడింది. ఈ ఘటనలో కారులో వెళ్తున్న కర్ణాటక చిక్బల్లాపూర్ చెందిన రమేష్ మూర్తి(34), హెచ్ కే మంజునాథ(38), హెచ్ జి ముని వెంకట్ రెడ్డి(55) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ప్రయణిస్తున్న తేజస్ కుమార్ (33), తమిళనాడుకు చెందిన కంటైనర్ డ్రైవర్ అల్లావుద్దీన్ (30) తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను పోలీసులు, స్థానికులు రక్షించి తిరుపతి రుయాకు తరలించారు. తేజస్ కుమార్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది.

**రక్షించమని ఆర్థనాదాలు**

భారీ కంటైనర్ పడడంతో కారు చిధ్రమైంది. అందులో ప్రయాణిస్తున్న నలుగురిలో ముగ్గురు అక్కడిక్కడే మరణించారు. వారి మృతదేహాలు నుజ్జునుజ్జు అయ్యాయి. కొనఊపిరితో కొట్టుకుంటున్న తేజస్ కుమార్ తనను కాపాడాలంటూ ఆర్తనాదాలు చేయడం అక్కడున్నవారిని కలచివేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు. కారుపైన పడిన భారీ కంటైనర్ ను రెండు క్రేన్ ల సాయంతో అతికష్టంపై తొలగించారు. మృత దేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద తీరును పరిశీలించారు. రోడ్డు ప్రమాదం కారణంగా ఘాట్ లో సుమారు ఐదు కిలో మీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి.



## స్పెషల్ ఎన్ ఫోర్స్మెంట్ బ్యూరో రద్దు

### సెబ్ ను ఏర్పాటు చేస్తూ గత వైసీపీ ప్రభుత్వం నిర్ణయం

**అమరావతి (సూర్య వాస్తవం):** స్పెషల్ ఎన్ ఫోర్స్ మెంట్ బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 'సెబ్' ను ఏర్పాటు చేస్తూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.12ను కూటమి ప్రభుత్వం తాజాగా రద్దు చేసింది. 'సెబ్' విభాగానికి గత ప్రభుత్వం కేటాయించిన సిబ్బందిని రిలీవ్ చేసింది. ఎక్సైజ్ శాఖలో రిపోర్ట్ చేయాలని 'సెబ్' సిబ్బందికి డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశించారు. 'సెబ్' కు చెందిన వాహనాలు, ఫర్నిచర్, కంప్యూటర్లు, అద్దె భవనాలను ఎక్సైజ్ శాఖకు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఎక్సైజ్ శాఖలోని 70 శాతం సిబ్బందిని 'సెబ్' కు కేటాయిస్తూ గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 'సెబ్' ఇన్నాళ్లూ ఎక్సైజ్ శాఖకు అనుబంధంగా పనిచేసింది.

## కాంగ్రెస్ పార్టీ పూర్వ వైభవానికి కృషి

(మొదటిపేజీ తరువాయి)



సాగునీరు సమస్యలు కనిగిరి , దొనకొండ, ఇండస్ట్రియల్ కారిడార్, దొనకొండ ఎయిరో డ్రం అభివృద్ధి తదితర సమస్యలపై చర్చించినట్లు అవసరమైతే త్వరలోనే ఉద్యమాన్ని కొనసాగిం చనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఒంగోలు డిసిసి నూతన అధ్యక్షుడిగా మొట్టమొదటిసారిగా మైనార్టీ సామాజిక వర్గానికి చెందిన తనను ఎంపిక చేసినందుకు షర్మిల రెడ్డి గారికి పూల బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు ఆమె చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సంతనాతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పాలపర్తి విజేష్ రాజ్ , యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కైపు వెంకటకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి బొడ్డు సతీష్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోరంట్ల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ప్రజాస్వామ్యం దెబ్బతింది

(మొదటిపేజీ తరువాయి)

మా ప్రభుత్వాన్ని లాక్కున్నారు. మా నుండి ప్రభుత్వాన్ని లాక్కోవడాన్ని నా కళ్లతో చూశాను. మా శాసనసభ్యులను కొనుగోలు చేశారు. బంధించారు. అకస్మాత్తుగా వారు బీజేపీ శాసనసభ్యులు అయ్యారు. ఇదంతా నేను చూశాను. అందుకే భారత ప్రజాస్వామ్యం దాడికి గురైంది. చాలా బలహీనమై పోయింది. ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. తిరిగి పూర్వ స్థితికి చేరుకుంటుందన్న నమ్మకం నాకు ఉంది' అని ఆయన చెప్పారు. భారత్‌లో ఎన్నికల ఫలితాలు ప్రజాస్వామ్యానికి మరింత జీవం పోశాయని మీరు భావించడం లేదా అని రాహుల్ పాత్రికేయులను ప్రశ్నించారు. 'నేను మాత్రం అలాగే అనుకుంటున్నాను. అయితే భారతీయ ఓటరు కష్టాల నుండి బయటపడ్డాడని చెప్పడానికి ఇది చాలదు' అని అన్నారు. 'మా బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేశారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండానే ఎన్నికల బరిలో దిగాము. ఏ ప్రజాస్వామ్య వ్యవస్థలో అయినా ఇలా జరుగుతుందని నేను అనుకోను. కానీ ఎన్నికల సమయంలో అక్షరాలా అదే జరిగింది. మా కోశాధికారిని అడిగితే డబ్బు లేదని చెప్పారు. మా ఓటరు అప్పటికే చేదు అనుభవాలు, కష్టాలను చవిచూశాడు. మేమేమో ప్రచారం చేసుకోవాల్సిన పరిస్థితి. సంప్రదింపులు జరపాల్సి ఉంది. సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. వీటన్నింటికీ నిధులు అవసరం కదా' అని తెలిపారు. తనపై 20కి పైగా కేసులు పెట్టారని రాహుల్ గుర్తు చేసుకున్నారు. 'భారత చరిత్రలో పరువు నష్టం కేసులో జైలు శిక్ష పడిన ఏకైక వ్యక్తిని నేనే. మా దేశంలో ఓ ముఖ్యమంత్రి ఇప్పటికీ జైలులోనే ఉన్నారు. ఎన్నో కష్టాలు చవిచూసిన భారతీయ ఓటరు ఓ శిలగా మారిపోయాడు. నిజంగా అలాగే నిలిచాడు. అయితే దానికి జీవం పోసేందుకు ఓ శిల్పి అవసరం. కానీ లేదు' అని వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోడీపై ఆయన విమర్శలు సంధిస్తూ '21వ శతాబ్దంలో ఆధునిక దేశంలో ఉన్న ఓ ప్రధానమంత్రి తాను దేవుడితో మాట్లాడానని ప్రజలకు చెబుతాడు. అందరి కంటే తాను భిన్నమైన వ్యక్తినని అంటాడు. మీరు జీవులని, తాను కానని చెబుతుంటాడు. తనకు దేవుడితో నేరుగా సంబంధాలు ఉన్నాయని అంటుంటాడు. అయితే ఆయన అట ముగిసిందని మేము అనుకుంటాము. మాకు పరాజయం పాలైన ప్రధాని ఉన్నాడని తెలుసు' అని ఎత్తిపొడిచారు. 'ఆయన చేసిన అద్భుతమైన పని ఏమిటంటే లోక్‌సభలో ప్రవేశించి, ప్రమాణస్వీకారం చేయడం. భారత రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని, తలపై ఉంచుకోవడం. ఇది చాలా ఆసక్తికరమైన పరస్పర విరుద్ధ స్వభావం. ఓ వైపు ఆయన రాజ్యాంగాన్ని ధ్వంసం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేశారు. ప్రజలేమో అదే రాజ్యాంగాన్ని తలపై పెట్టుకునేలా చేశారు' అని మోడీపై రాహుల్ వ్యంగ్యోక్తులు విసిరారు. రిజర్వేషన్లపై తన వ్యాఖ్యలను కొందరు వక్రీకరించారని కాంగ్రెస్ నేత వివరణ ఇచ్చారు. 'నేను మీకు స్పష్టంగా చెబుతున్నాను. నేను రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదు. మేము రిజర్వేషన్ల పరిమితిని పెంచుతాము. యాభై శాతానికి పైగా రిజర్వేషన్లు ఇస్తాము' అని చెప్పారు. ప్రజలందరికీ భాగస్వామ్యం కల్పించే విషయంలో తీవ్రమైన సమస్య ఉన్నదని, తాము దానిని పరిష్కరిస్తామని తెలిపారు. 'ఇది మండల్ వర్సెస్ కమండల్ వ్యవహారంగా నేను భావించడం లేదు. కేవలం రిజర్వేషన్లు మాత్రమే సమస్యకు పరిష్కారం అనే ఆలోచనకు భిన్నమైన దానిని మేము చెబుతున్నాము. అసలు ఏం జరుగుతోంది అనే దానిపై సమగ్ర అవగాహన ఏర్పరచుకోవాలని మేము అనుకుంటున్నాము. ఆ తర్వాత లోపాలను సరిదిద్దేందుకు అనేక విధానాలు అమలు చేస్తాము. వాటిలో రిజర్వేషన్లు ఒకటి' అని రాహుల్ వివరించారు.

# రైతులను ముంచింది గత పాలకులే..!

(మొదటిపేజీ తరువాయి)

వదిలేశారని మండిపడ్డారు. తట్టెడు మట్టి కూడా తీయలేదు. డ్యాంలు కొట్టుకు పోతున్నా జగన్ కి పట్టింపు లేదన్నారు. నిర్లక్ష్యం ఫలితం రాష్ట్ర వ్యాప్తంగా 6 లక్షల ఎకరాలకు నష్టం వాటిల్లిందన్నారు. చంద్రబాబు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇస్తే ఏ మూలకు చాలుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం ఎకరాకు రూ.25 వేల పరిహారం ప్రకటన చేయాలన్నారు. జగన్ హయాంలో ఎకరాకు రూ.4 వేల పరిహారం అని మోసం చేశాడన్నారు. జగన్ చేసిన మోసం మళ్ళీ బాబు చేయొద్దని హితవు పలికారు. రాష్ట్రంలో జరిగిన నష్టంపై వెంటనే పరిహారం ఇవ్వండని ఎన్డీయే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఎన్డీయే ప్రభుత్వానికి రాష్ట్రం అంటే చిన్న చూపు కనకే కనీసం మంచినీళ్లు కూడా ఇవ్వలేదన్నారు.

# హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఎమ్మెల్యే కోనేటి

**నారాయణవనం-సూర్య వాస్తవం:** సత్యవేడు తెలుగుదేశం ఎమ్మెల్యే ఆదిమూలం కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఆదిమూలం తనను లైంగికంగా వేధించారని, అత్యాచారం చేశారని ఆరోపించి, ఆయన మీద అత్యాచారం కేసు పెట్టిన మహిళ ఎట్టకేలకు వైద్య పరీక్షలకు ముందుకొచ్చారు. తొలుత మీడియా ముందుకు వచ్చిన ఆమె తనకు రాజకీయంగా ఎలాంటి మద్దతూలేదని, తనకు భయమేస్తోందని చెప్పిన ఆ మహిళ ఈ తరువాత వైద్య పరీక్షలకు నిరాకరించారు. దీంతో ఆమెకు బెదరింపులు వచ్చాయా అన్న అనుమానాలు వ్యక్తం అయ్యాయి. సరిగ్గా అదే సమయంలో ఆదిమూలం మీద అత్యాచారం కేసు పెట్టిన మహిళ మీద సత్యవేడు ప్రాంతంలోని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా ఎదుగుతున్న ఆదిమూలం లాంటి దళిత నాయకుడిని బదనాం చేయడానికే ఆ మహిళ ఇలాంటి ఆరోపణలు చేస్తూ, కేసు పెట్టిందని మండిపడుతూ, ఆ మహిళ మీద తిరుపతి జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో




వారు కేసులు నమోదు చేశారు.

ఇక తాజాగా చెన్నై అపోలో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందిన ఆదిమూలం డిశ్చార్జ్ అయ్యి పుత్తూరులోని తన నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే బంధువులు, గన్ మెన్లు ఆయనను కలవడానికి ఎవరినీ అనుమతించడం లేదు. ఆదిమూలం అత్యాచారం కేసుకు సంబంధించి తిరుపతి ఇంటెలిజెన్స్ డీఎస్పీ కనజక్షన్ నేతృత్వంలో విచారించి ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. మరోవైపు తనపై పోలీసులు కేసు నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆదిమూలం హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదైన కేసును కొట్టివేయాలని మంగళవారం (సెప్టెంబర్ 9)క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఎలాంటి దర్యాప్తు చేయకుండానే పోలీసులు తనపై కేసు నమోదు చేశారని ఆదిమూలం పిటిషన్ లో పేర్కొన్నారు.

అదలా ఉండగా ఇంత కాలం వైద్యపరీక్షలకు నిరాకరించిన బాధితురాలు ఆదిమూలం క్యాష్ పిటిషన్ దాఖలు చేసిన అనంతరం వైద్య పరీక్షలకు ముందుకొచ్చారు. తిరుపతి మెటర్నరీ హాస్పిటల్లో బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు, మరో రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలోనే ఉండాలని సూచించారు. ఇక ఆ వైద్య పరీక్షల రిపోర్టు ఆధారంగా పోలీసులు ఎమ్మెల్యేను విచారించనున్నారు. ఇలా ఉండగా ఎమ్మెల్యే ఆదిమూలం తరఫున న్యాయవాది శేషకుమారి వాదించనుండగా, ప్రభుత్వం తరఫు న్యాయవాదిగా వరలక్ష్మి వాదించనున్నారు.

# మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎన్‌సీసీ తోడ్పాటు

### కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబి ఫిలిప్

**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి:** నంద్యాలలోని శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో గురువారం డిగ్రీ ఫస్ట్ ఇయర్ మహిళా విద్యార్థినులకు ఎన్సిసి ఎన్రోల్మెంట్ మరియు సెలక్షన్స్ జరిగాయి. ఈ కార్యక్రమానికి కళాశాల చైర్మన్ ఆచార్యులు రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. తొమ్మిదవ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కర్నూలు ఎన్సిసి కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ జోబి ఫిలిప్ మరియు మేజర్ శ్రీ ప్రియ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ తొమ్మిదవ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కర్నూలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాలలో ఫస్ట్ ఇయర్ మహిళా విద్యార్థినుల కొరకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో కమాండింగ్ ఆఫీసర్ జోబీ ఫిలిప్ మాట్లాడుతూ మహిళలు తమకు ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎన్సిసి లో చేరి నాయకత్వ



లక్షణాలతో ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని అందుకు ఉన్న అవకాశాల అన్నింటిని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి ఉన్న కళాశాల విద్యార్థినులు మీకు ఉన్న సీట్లు అన్ని సద్వినియోగం చేసుకోవాలని దాదాపుగా 62 సీట్లు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని అన్నారు. ఎన్సిసి లో చేరటం వలన క్రమశిక్షణ దేశభక్తి ఆత్మవిశ్వాసము నాయకత్వ లక్షణాలు, శారీరక దారుఢ్యం ,ధైర్యం ,సాహసం వంటి ఎన్నో లక్షణాలు అలవాడతాయని దీనివలన మీరు జీవితంలో ఎన్నో అద్భుతమైన విజయాలు లక్ష్యాలు చేరుకోవడానికి దోహదం చేస్తాయని అన్నారు. తప్పనిసరిగా ప్రతి కళాశాల విద్యార్థిని ఆర్థిక స్వావలంబన దిశగా ప్రయత్నం చేసినప్పుడు పురుషులతో పాటు స్త్రీలు కూడా అన్ని రంగాలలో రాణిస్తున్న ఈ కాలంలో మహిళలకు ఉన్న ఎన్నో అవకాశాలు చట్టాలు వినియోగించుకోవాలని అన్నారు. ఇతరుల పైన ఆధారపడే మనస్తత్వాన్ని విడనాడాలని స్వయంకృషితో పైకి రావడానికి ప్రయత్నం చేయాలని ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని అన్నారు. అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ మేజర్ శ్రీ ప్రియ మాట్లాడుతూ కొత్తగా ఎన్సిసిలో చేరుతున్న కళాశాల విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మహిళలు అని రంగాలలో రాణించాలని ఉన్నతమైన లక్ష్య సాధన దిశగా అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అప్పుడే మీరు మీ కుటుంబాలకు చేయూతగా ఉండి నడిపిస్తారని అన్నారు.

సూర్య వాస్తవం

# సంపాదకీయం

## కాంగ్రెస్, బీజేపీలకు సవాల్‌గా హర్యానా

కిందటిసారి 2019 అక్టోబరులో హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ఏ పార్టీకి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేంతటి మెజారిటీ రాలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి 40 గెలుచుకుంది. దుష్యంత్ చౌతాలా నాయకత్వంలోని జన్నాయక్ జనతా పార్టీకి 10 సీట్లు లభించాయి. దీంతో బిజెపి, జన్నాయక్ జనతా పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. మనోహర్‌లాల్ ఖట్టర్ తొలిసారి హర్యానా ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అయితే బిజెపి, జెజెపి మధ్య విభేదాలు తలెత్తాయి. చాలా కాలం ఈ విభేదాలు నడిచాయి. అయితే చివరకు ఈ ఏడాది మార్చి నెలలో సంకీర్ణ ప్రభుత్వం పడిపోయింది. మనోహర్‌లాల్ ఖట్టర్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. హర్యానా ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్న విషయాన్ని బిజెపి అధిష్టానం గుర్తించింది. రైతుల ఆందోళన, అగ్నిపథ్ పథకం, నిరుద్యోగం వంటి అంశాలతోపాటు పదేండ్ల పాలనపై సహజంగా ఉండే ప్రజావ్యతిరేకత బిజెపికి మైనస్‌గా మారాయి.హర్యానా అసెంబ్లీ ఎన్నికలు బిజెపికి సవాల్‌గా మారాయి. దాదాపు రెండేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అగ్నిపథ్ పథకం, బిజెపికి మైనస్ పాయింట్‌గా మారనుంది. అగ్నిపథ్ మెరికల్లాంటి యువతకు సైన్యంలో కొలువులు కల్పించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. అయితే సైన్యంలో కొలువు అంటే ఓ ఇరవై ఏళ్లో లేదా పాతికేళ్లో అని అందరూ భావిస్తారు. కనీసం పదిహేనేళ్లు అయినా ఉంటుందని ఆశిస్తారు. అయితే అగ్నిపథ్ పథకంలో కేంద్రం ఇచ్చే ఉద్యోగం కేవలం నాలుగేళ్లే ఉంటుంది. పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల మధ్య వయసులో ఉన్న యువకులు ఈ పథకానికి అర్హులు. విద్యార్హతలు కూడా పెద్దగా అవసరం లేదు. ఇంటర్మీడియట్ లేదా పదో తరగతి పాసయితే చాలు. అగ్నిపథ్‌కు ఎంపికైన వాళ్లను వాళ్లవాళ్ల అర్హతలను బట్టి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ ఇలా ఎందులోనైనా భర్తీ చేస్తారు. సర్వీస్ కేవలం నాలుగేళ్లే అయినా వేతనం మాత్రం ఆకట్టుకునేలా ఉంటుంది. మొదటి ఏడాది నెలకు ముప్ఫయి వేలు ఇస్తారు. రెండో ఏడాది ముప్ఫయి మూడు వేలు ఇస్తారు. మూడో ఏడాది అయితే ముప్ఫయి ఆరు వేల అయిదు వందల వేతనం ఉంటుంది. ఇక చివరగా నాలుగో ఏడాది నెలకు నలభై వేలు వేతనంగా ఇస్తారు.అగ్నిపథ్ పథకంలో భాగంగా సైన్యంలో కొలువులు చేసేవారిని అగ్నివీరులుగా పిలుస్తారు.నాలుగేళ్ల సర్వీస్‌కు కార్పస్ ఫండ్ కింద కొంత అమౌంట్ కూడా జమ చేస్తారు. అయితే నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అగ్నివీరులు ఇంటికి పోవాల్సిందే. మరో ప్రత్యామ్నాయం లేదు. అయితే అగ్నివీరులు నిరుత్సాహపడకుండా వారికి భవిష్యత్తులో అనేక అవకాశాలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఆశ పెడుతున్నారు. ఇందు కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి హామీ లేకపోవడం విశేషం. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే నాలుగేళ్ల సర్వీసు పూర్తి చేసిన అగ్నివీరులకు ఆ తరువాత ఎటువంటి పెన్షన్ సౌకర్యం ఉండదు. అంతిమంగా సైన్యంపై ఎలాంటి అదనపు ఆర్థిక భారం ఉండదు. భారత సైన్యంపై సిబ్బంది వేతనం, పెన్షన్ భారాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా అగ్నిపథ్ పథకాన్ని రూపొందించింది కేంద్రం. హర్యానాలోని మెజారిటీ యువకులు స్కూల్ ఫైనల్ పాసవ్వగానే సైన్యంలోకి భర్తీ అవడానికి ప్రయత్నిస్తారు.ఇరవై ఏళ్ల సర్వీసు పూర్తయిన తరువాత అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులులాగే పెన్షన్ సౌకర్యానికి అర్హులవుతారు. అయితే కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ప్రారంభించిన అగ్నిపథ్ పథకంలో పెన్షన్ సౌకర్యం ఉండదు.అంతేకాదు నాలుగేళ్ల సర్వీసు తరువాత మళ్లీ కొత్తగా ఉద్యోగం వెతుక్కోవాల్సిందే. దీంతో బిజెపి నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై హర్యానా యువత ఆగ్రహంతో రగిలిపోతోంది. ప్రభుత్వంపై వ్యతిరేకతను తగ్గించేందుకు తొమ్మిదిన్నరేండ్లు ముఖ్యమంత్రిగా ఉన్న మనోహర్‌లాల్ ఖట్టర్‌ను తప్పించి ఇటీవల నాయబ్ సింగ్ సైనీని ముఖ్యమంత్రిని చేసింది. ఇదిలా ఉంటే ప్రజలను ఆకర్షించడమే పనిగా వరాలు ప్రకటించి కర్ణాటక, తెలంగాణ ఎన్నికల్లో సక్సెస్ అయిన ఫార్ములానే హర్యానాలోనూ కాంగ్రెస్ పార్టీ నమ్ముకున్నది.కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వృద్ధులకు నెలకు రూ.6,000 పింఛను, 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీలు ఇచ్చింది. బిజెపి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కలిసొస్తుందని కాంగ్రెస్ ఆశిస్తోంది. కాగా ఈసారి ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరిగే అవకాశాలున్నాయి. దాదాపుగా అన్ని సీట్లలో బిజెపి, కాంగ్రెస్, జెజెపి మధ్య తీవ్ర పోటీ ఉండే అవకాశాలున్నాయి. ఎన్ని మైనస్ పాయింట్లు ఉన్నా హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి ఉన్న క్లీన్ ఇమేజ్‌పైనే బిజెపి ప్రధానంగా ఆధారపడుతోంది. అంతేకాదు కేంద్రంలో బిజెపి అధికారంలో ఉండటం కూడా దానికి ప్లస్ పాయింట్‌గా మారింది. డబుల్ ఇంజన్ నివాదంతో దూసుకుపోవాలని బిజెపి భావిస్తోంది. అయితే బిజెపిపై ప్రజల్లో ఉన్న ఆగ్రహం ఏమేరకు తగ్గుముఖం పడుతుందన్నది వేచి చూడాల్సిందే.



# ఏచూరి..చట్టసభలో సామాన్యుల గొంతుక

**అనారోగ్యంతో కన్నుమూసిన సీపీఎం దిగ్గజం సీతారాం ఏచూరి సుదీర్ఘకాలం రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. తొలిసారి ఆయన 2005లో బెంగాల్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ తదితర భాషల్లో అనర్గళంగా మాట్లాడే ఏచూరి చట్టసభలో సామాన్యుల పక్షాన గొంతెత్తారు. ప్రభుత్వాలపై తనదైన శైలిలో ప్రశ్నలు సంధించేవారు. ప్రస్తుత కమ్యూనిస్ట్ అగ్రనేతల్లో ఒకరైన ఏచూరికి దేశవ్యాప్తంగా పార్టీలకు అతీతంగా అభిమానులున్నారు.**



### ఏచూరి ప్రస్థానం ఇదీ..

ఏచూరి సర్వేశ్వర సోమయాజులు, కల్పకం దంపతులకు 1952 ఆగస్టు 12న చెన్నై లో జన్మించిన సీతారాం ఏచూరి 1974లో ఎస్ఎఫ్ఐ చేరారు. 1975లో సిపిఎం ప్రాథమిక సభ్యత్వంను తీసుకున్నారు. 1985లో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైయ్యారు.

ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారు. విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారు. 2005 నుంచి 2017 వరకు రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. 1985లో పన్నెండవ పార్టీ కాంగ్రెస్ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. పి సుందరయ్య, ఇఎంఎస్, బిటిఆర్, హరికిషన్ సింగ్ సూర్జిత్, బసవ పున్నయ్య మరియు జ్యోతిబసు వంటి సీనియర్ నాయకులతో కలిసి పనిచేశారు. 1992లో జరిగిన 14వ పార్టీ కాంగ్రెస్ సెషన్‌తో పొలిట్‌బ్యూరోకు చేరుకున్నారు.

మతతత్వం మరియు నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఏచూరి క్రమం తప్పకుండా పార్లమెంటులో జోక్యం చేసుకున్నారు. రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖల స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా ముఖ్యమైన నివేదికల తయారీకి ఆయన నాయకత్వం వహించారు. 1996లో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం, 2004లో మొదటి యూపీఏ ప్రభుత్వం ఏర్పాటులో ఏచూరి కీలకపాత్ర పోషించారు. సీతారాం విద్యాభ్యాసం హైదరాబాద్ లో సాగింది. ఆ తర్వాత ఢిల్లీలోని సెయింట్ స్టీఫెన్స్ కాలేజీలో ఆర్థికశాస్త్రంలో బీఏ, జవహర్ లాల్ వర్సిటీలో ఎంఏ పూర్తి చేశారు. ఆర్థిక శాస్త్రంలో పరిశోధనలు ప్రారంభించిన ఆయన ఎమర్జెన్సీ సమయంలో జైలుకెళ్లడంతో వాటిని ఆపేశారు.

భారతీయ రాజకీయ, సామాజిక పరిస్థితులను ప్రజా ఉద్యమాలకు తాత్విక స్పష్టతతో తీర్చిదిద్దే రాజకీయ, సంస్థాగత బాధ్యతను నిర్వర్తించిన నాయకుడు ఏచూరి. ఆయన భార్య ప్రముఖ పాత్రికేయురాలు, రచయిత్రి సీమా చిస్తీ. బ్రిటన్‌లో యూనివర్సిటీ టీచర్‌గా పనిచేస్తున్న అఖిలా ఏచూరి, జర్నలిస్టు ఆశిష్ ఏచూరిల పిల్లలు. ఇంగ్లీషు, హిందీ, తెలుగు, తమిళం మరియు బెంగాలీ భాషల్లో ప్రావీణ్యం ఉన్న ఏచూరి లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్, వాట్ ఈజ్ హిందూ రాష్ట్ర, సోషలిజం ఇన్ ట్వంటీ-ఫస్ట్ సెంచరీ, కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం మరియు ఘృనా కీ రాజనీతి (హిందీ) వంటి పుస్తకాలను రచించారు.

- సూర్య వాస్తవం ప్రతినిధి

# జిల్లాలో అదుపుతప్పిన శాంతిభద్రతలు

- వైసీపీ శ్రేణులే లక్ష్యంగా దాడులు శోచనీయం
- క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తాం
- వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి స్పష్టీకరణ

**అనంతపురం (సూర్య వాస్తవం):** తుంగభద్ర డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా రైతాంగానికి ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లాలో రైతాంగం ఏకంగా 5 లక్షల ఎకరాలకు పైగా విత్తనం వేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం తర్వాత తొలిసారి అనంతపురం జిల్లాకు విచ్చేసిన అనంతను గురువారం పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనంత మీడియాతో మాట్లాడారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించినందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఓడిపోయాక కుంగిపోవడం, గెలిచాక పొంగిపోవడం తమకు తెలియదని స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పేద, బడుగు, బలహీన వర్గాలకు, రైతాంగానికి తోడుగా ఉంటామని తెలిపారు. తమకు అధికారం కొత్త కాదు.. ప్రతిపక్షం కొత్త కాదని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అందరూ కలిసికట్టుగా పని చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల్లో పార్టీ ఓటమిపై సమీక్షించుకుంటామని, క్షేత్రస్థాయిలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని తెలియజేశారు.



### ప్రభుత్వానిది డైవర్షన్ పాటిలిక్స్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు అయ్యిందని, కేవలం పింఛన్లు ఇవ్వడం మినహా చేసిందేమీ లేదని అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన కూడా చేయ లేకపోతున్నారని అన్నారు. ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేక, సమస్యలను పక్కదారి పట్టించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ఈ క్రమంలోనే వైసీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలు అదుపుతప్పాయని విమర్శించారు.

### 5 లక్షల ఎకరాలకు పైగా విత్తనం నిల్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు గాను సుమారు 5 లక్షల ఎకరాలకు పైగా విత్తనం వేయలేని పరిస్థితి నెలకొందని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. వేసిన పంట కూడా చేతికందే పరిస్థితి లేదని అన్నారు. అనంతపురం జిల్లాలో 68 శాతం, శ్రీసత్యసాయి జిల్లాలో 52 శాతం వరకు మాత్రమే పంటల సాగు జరిగిందన్నారు. ఈ ఖరీఫ్‌లో జూలై, ఆగస్టు మాసాల్లో విత్తనాలు వేయని పరిస్థితి నెలకొందని.. జూన్‌లో సాగు చేసిన పంటలు కూడా చేతికందని దయనీయం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఐఏబీ సమావేశం వాయిదా బాధాకరం

ఇరిగేషన్ అడ్వయిజరీ బోర్డు (ఐఏబీ) సమావేశం వాయిదా వేయడం బాధాకరమని అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. విజయవాడలో వరద సమస్య ఉందని మీటింగ్ వాయిదా వేశారని, ఇక్కడ రైతాంగం కూడా తీవ్ర ఇబ్బందుల్లో ఉందని గుర్తు చేశారు. తక్షణం ఐఏబీ సమావేశం నిర్వహించి నీటి కేటాయింపులు, తేదీలు ఖరారు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో కూడా చర్చించినట్లు చెప్పారు. ఇటీవల తుంగభద్ర డ్యాం వద్ద గేట్ సమస్య వచ్చిందని, ఇప్పుడు డ్యాంలో నీరు పుష్కలంగా ఉన్నా నీరు ఇవ్వలేని పరిస్థితి నెలకొనడం బాధాకరమన్నారు. తక్షణం తాగు, సాగు నీటి అవసరాల కోసం హెచ్ఎల్‌సీకి నీరు విడుదల చేయలని డిమాండ్ చేశారు.

# వైసీపీ శ్రేణులకు అండగా ఉండండి

- వీరాంజనేయులుకు అనంత వెంకటరామిరెడ్డి సూచన
- ప్రత్యర్థుల దాడిలో గాయపడిన కార్యకర్తకు రూ.50 వేలు ఆర్థిక సాయం

**అనంతపురం-సూర్య వాస్తవం:** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉండాలని శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త వీరాంజనేయులుకు వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి సూచించారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆదిలక్ష్మి ప్రత్యర్థుల దాడిలో గాయపడ్డారు. దీంతో వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.50 వేలు చెక్కు పంపించారు. గురువారం తన స్వగృహంలో చెక్కును వీరాంజనేయులకు అనంత అందజేశారు. అనంతరం శింగనమల నియోజకవర్గంలో పార్టీ పటిష్టత గురించి వారు చర్చించారు. గెలుపోటములు సహజమని, నిత్యం ప్రజల్లో ఉండాలని సూచించారు.



## ఉత్కంఠ భరితంగా సామాజిక తనిఖీ




**రైల్వే కోడూరు-సూర్య వాస్తవం:** రైల్వే కోడూరు మండలంలోని ఉపాధి హామీ సిబ్బంది రెండవ రోజు ఉత్కంఠ భరితంగా కొనసాగించిన సామాజిక తనిఖీల్లో రోజురోజుకు అవినీతిగా లీలలు మెండుగా పెల్లిబికి పోయాయని పాల్గొన్న స్థానికులు, రైతులు, బాధితులువెలుబుచ్చారు. బుధవారం జరిగిన సామాజిక తనిఖీలో కుక్కల దొడ్డి శెట్టిగుంట ఉప్పరపల్లి ఉపాధి పని ఒకటి, నగదు మరొకటి అన్న చందంగా కొలమానికులు టెక్నికల్ అసిస్టెంట్ ఉపాధి హామీ సిబ్బంది పలు రకాలుగా అవినీతి లీలలు ప్రదర్శన పట్ల పలు రకాల విమర్శలు ఏపిడి రవికుమార్ దృష్టికి రావడంతో ఆయన ఒకింత సహనాన్ని ఒకింత ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. పూర్తిస్థాయిలో రైల్వేకోడూరు మండలంలో ప్రతి ఒక్క పంచాయతీలో అవినీతికి అడ్డాగా మారిందని స్థానికులు తెలిపారు. దీనికి సంబంధించిన అధికారులు రికవరీ చేసే పరిస్థితులు మెండుగా ఉన్నదని సమాచారం వెల్లడయింది. వారి దగ్గర నుండి రికవరీ చేయిస్తారా రాజీ పడతారా అనే కోణంలో ఒకింత అనుమానంగా ఉన్నదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ముఖ్యంగా అనంతరాజుపేట పంచాయతీలో భార్యకు ఒక జాబు కార్డు నెంబరు 070222, భర్తకు జాబ్ కార్డు నెంబరు 070093 వేర్వేరుగా ఉండడంతో ఉపాధి హామీ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవికుమార్ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాషువా, ఏపీవో ఉమామహేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ సిబ్బంది, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సర్వసభ్య సమావేశం

**దువ్వూరు-సూర్య వాస్తవం :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల మండల సర్వసభ్య సమావేశం రేపు శనివారం దువ్వూరు ఎంపీపీ పాఠశాల నందు నిర్వహిస్తున్నట్లు మండల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షులు నూరే కృష్ణయ్య పేర్కొన్నారు. గురువారం ఆయన దువ్వూరులో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ ఉపాధ్యాయులు చాలా బాధలు అనుభవించారని, 11వ పి ఆర్ సి ,దాని అరియర్స్ డి ఏ అరియర్స్ కు దూరమయ్యారు. ఒక్కొక్క ఉద్యోగి 50 వేల రూపాయల నుంచి 3 లక్షల రూపాయల వరకు నష్టపోయారని కృష్ణయ్య తెలిపారు. ప్రస్తుత కూటమి సంకీర్ణ ప్రభుత్వం 12వ పిఆర్సి మీద ఆశలు పెట్టుకున్నామని తెలిపారు. 11వ పిఆర్సి లో కొంతైనా ఈ ప్రభుత్వం తమకు అందిస్తుందని ఆయన తెలిపారు కావున మండలంలోని పెన్షనర్లందరూ రేపు శనివారం తప్పకుండా హాజరు కావాలని సూచించారు.

## రూ.1.75 కోట్లకు ఎగ్జిబిషన్ వేలం




**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో ప్రతి సంవత్సరం విజయదశమి పర్వదినం సందర్భంగా పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు నిర్వహించే ఎగ్జిబిషన్ కోసం గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వేలంలో దాదాపు 18 మంది పాట దారులు పాల్గొనగా బహిరంగ వేలంలో టోకెన్ నెంబర్ 1 కలిగిన ఆర్.వి. చలపతి 1,75,00,000 మరియు 18 శాతం జీఎస్టీ తో దక్కించుకున్నారని కమిషనర్ తెలిపారు. కాగా 45 రోజుల పాటు సాగే ఈ ఎగ్జిబిషన్ లో గెజిట్ లో పొందుపరిచిన ప్రకారమే రేట్లు వుండాలని వివరించారు.

## ఘనంగా గణనాథుని నిమజ్జనం



**లక్కిరెడ్డిపల్లె-సూర్య వాస్తవం:** వినాయక చవితిని పురస్కరించుకొని మండలంలో వాడ వాడలా వినాయకుని విగ్రహాలు ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం,సాయంత్రం వేళల్లో గణనాధునికి ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. లక్కిరెడ్డిపల్లి టౌన్ లోను 20 విగ్రహాలు పైగా ఏర్పాటు చేశారు కాకులవరం ముని రెడ్డి గారి పల్లెకు చెందిన అబ్బవరం ప్రవీణ్ కుమార్ రెడ్డి (సినిమా హీరో),పీలం భరత్ రెడ్డి వినాయకుని లడ్డు 67,100 రూపాయలు వేలంపాటలో దక్కించుకున్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లె, పర్వత రెడ్డి గారి పల్లె, కోనంపేట,బి.ఎర్రగుడి, కొత్తకోటలులో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహాలను ఆయా గ్రామ చెరువులు,కుంటలు లక్కిరెడ్డిపల్లి కు చెందిన విగ్రహాలను దొరిచెరువులో నిమజ్జనం చేశారు. విగ్రహ ఊరేగింపులో కోలాటాలు,డీజే పాటలతో నృత్య ప్రదర్శనలు రంగుల కుంకాలు చల్లుకుంటూ ఆనంద ఉత్సాహాల మధ్య నిమజ్జనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాంబశివ వెంకటరమణ,జయరాం, రియాజ్,నాగేంద్ర,కొలిమిరెడ్డి, మహబూబ్ బాషా యువకులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకై యువత ఉద్యమించాలి

## - వైస్ ఛాన్సలర్ విశ్వనాథ్ కుమార్




**చెన్నూరు-సూర్య వాస్తవం:** మాదకద్రవ్యాలు ,డ్రగ్స్ మత్తుపదార్థాల నిర్మూలనకై యువత ఉద్యమించాలని అలాగే దీనిని ఒక సవాలుగా తీసుకొని యువతే కాకుండా అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ విశ్వనాథ్ కుమార్ అన్నారు. జిల్లా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా జే.బి.వి.ఎస్ ధి ప్రిజర్వేర్ సేవ సమితి, డాక్టర్ వైయస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనాన్స్ యూనివర్సిటీలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ విశ్వనాథ్ కుమార్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వాడడం వల్ల యువత తప్పుదారులు పడుతున్నారని, మత్తు పదార్థాలకు అలవాటు పడ్డ విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతూన్నారని. విద్యార్థులు, యువకులుఇటువంటి డ్రగ్సు, మత్తు, మాదకద్రవ్యాలకు అలవాటు పడి అనరోగ్యపరమైన సమస్యలకు లోనవుతునారని ఆయన తెలిపారు. మరో అతిథిగా విచ్చేసినటువంటి డాక్టర్ నూరి పారి మాట్లాడుతూ ముఖ్యంగా చదువుకుంటున్న యువత మాదకద్రవ్యాల గురించి అవగాహన పొంది తమ చుట్టూ ఉన్న ప్రజలకి అవగాహన కల్పించే విధంగా ముందుకెళ్లాలని అలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకున్నట్లయితే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. సైక్యారిటిష్ డాక్టర్ షాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ యువత ఈ దేశానికి వెన్నుముక లాంటి వాళ్ళని అలాంటి యువత సరైన అవగాహన లేక మాదక ద్రవ్యాలకు లోనవుతున్నారని ఈ మధ్యకాలంలో యువత మాదక ద్రవ్యాలకి ఆకర్షితులు అవుతున్నారని తమ కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని యువత చెడు అలవాట్ల కు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జే.బి.వి.ఎస్ ధి ప్రిజర్వేర్ సేవ సమితి వ్యవస్థాపకుడు ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అశోక్ మాట్లాడుతూ, డ్రగ్స్ పైన మొదటిగా యువత అవగాహన పొందితే వాళ్లు వారి చుట్టూ ఉన్న పదిమందిని మార్చగలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్, యూనివర్సిటీ సిబ్బంది, సంస్థ సభ్యులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఆయేషా, సిరి చందన, ప్రవళిక, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో సజావుగా రాష్ట్ర పాలన




**ప్రొద్దుటూరు-సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజల భాగస్వామ్యంతో సజావుగా సాగుతోందని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అన్నారు. గురువారం స్థానిక నెహ్రూ రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీకి ఇక భవిష్యత్తు లేదన్నారు. మాట్లాడుతూ రాజధాని విజయవాడలో గడచిన కొద్ది రోజులుగా వరదలకు దాదాపు 40 శాతం మునకకు గురయ్యిందన్నారు. వరదకు 36 మంది మృతి చెందితే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మరణాల సంఖ్య అధికంగా చెబుతున్నారని అన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పాలన సజావుగా సాగుతోందన్నారు. ముఖ్యమంత్రి ఏనాడు ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపుచర్యలకు పాల్పడలేదని అన్నారు. నాగార్జున, శ్రీశైలం, పులిచింతల లాంటి ప్రాజెక్టులు కూడా జలకళ సంతరిచుకున్నాయన్నారు. బుడమేరు పొంగి పొర్లటానికి ఆక్రమనలే కారణమని అన్నారు. సీఎం చంద్రబాబు పది రోజులు బస్సులో పడుకొని సహాయక చర్యల్లో స్వయంగా పాల్గొన్నారని అన్నారు. నిరంతరం అప్రమత్తతతో అధికారులచే పరిస్థితులను చక్కదిద్దే ప్రయత్నం చేశారని చెప్పారు. ఒక్క వైసీపీ నేత కూడా వరద సహాయ చర్యలు చేసిన పాపన పోలేదన్నారు. ప్రొద్దుటూరులో అభివృద్ధి అంతా శిలఫలకాలకే పరిమితం అయ్యిందన్నారు. త్వరలో 15 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు.

# ఆడిటర్స్ సమస్యల పరిష్కారానికి కృషి

## - ఏపీటీపీ సీఏ రాష్ట్ర ముఖ్య సలహాదారు షరీఫ్ ఖాన్




**కడప-సూర్య వాస్తవం ప్రతినిధి:** రాష్ట్రంలో ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్సీ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ కన్సల్టెన్సీ అసోసియేషన్ ముఖ్య సలహాదారు పఠాన్ షరీఫ్ ఖాన్ కోరారు. గురువారం శ్రీ శ్రీనివాస రెసిడెన్సిలో వైయస్సార్, అన్నమయ్య జిల్లాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ అసోసియేషన్ భవన నిర్మాణానికి జిల్లాలలో ఐదు సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాలు లేని ఆడిటర్లకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని కోరారు. ఆడిటర్ లేనిదే ప్రభుత్వానికి ఆదాయం లేదని తెలిపారు. ఇన్కమ్ టాక్స్ పై అవగాహన కోసం ప్రతినెల కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐకమత్యంగా ఉంటే సమస్యలు పరిష్కారం అవుతాయని, అధికారము సాధించేందుకు వీలవుతుందని తెలిపారు. అందుకే అసోసియేషన్ అవసరమని చెప్పారు. ఇన్కమ్ టాక్స్ రిటర్న్స్ నవంబరు, డిసెంబరు వరకు పొడిగించాలని కోరతామన్నారు. కేరళ, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ లో వరదలు వచ్చి ప్రజా జీవితాన్ని అతలాకుచలం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు ఉంటే నాయకత్వ దృష్టికి తీసుకురావాలని కోరారు. కోవిడ్ సమయంలో ఎంతోమందిని ఆదుకున్నామని చెప్పారు. కడపలో అసోసియేషన్ భవనం నిర్మిస్తే రూ. 2లక్షలు ఇస్తామని ప్రకటించారు. ఆదాయ మార్గాలు పెంచుకోవాలని తెలిపారు. జిల్లా కార్యదర్శి జయకృష్ణ మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా వృత్తి సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. అందుకే అవగాహన సదస్సుల ద్వారా సందేహాలు నివృతి అవుతాయని తెలిపారు. అనంతరం వైయస్సార్, అన్నమయ్య జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా పోసా మల్లికార్జున, ఉపాధ్యక్షులుగా గండికోట శివకుమార్, కార్యదర్శిగా జయకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శిగా వడ్డీ నాగరాజు, అష్రఫ్ అలీఖాన్, పఠాన్ తౌహీద్ ఖాన్, కోశాధికారిగా శ్రీనివాసులు, ఈసీ మెంబర్స్ ఎన్నుకున్నారు. అనంతరం సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు, నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వరదరాజులు, చంద్రశేఖర్, శివకుమార్, గౌరవాధ్యక్షులు కుమార్, చంద్రమౌళి, శ్రీనివాసరావు, సత్యనారాయణ రాజు, ఆదినారాయణ రెడ్డి, ఆడిటర్స్, టాక్స్ ప్రాక్టీషనర్స్, లయన్ పఠాన్ మన్సూర్ అలీ ఖాన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# రాయలసీమ అభివృద్ధి ప్రభుత్వాలదే బాధ్యత

## బొజ్జా దశరథరామిరెడ్డి

**నంద్యాల-సూర్య వాస్తవం:**

రాయలసీమ అభివృద్ధి, పౌర సమాజం అవగాహన, భవిష్యత్తు కార్యాచరణ తదితర అంశాలపై రాయలసీమ సాగునీటి సాధన సమితి ఆద్వర్యంలో గురువారం నంద్యాల లో నిర్వహించడం జరిగింది. లాయర్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాయలసీమలోని ఎనిమిది జిల్లాల నుండి ప్రజా సంఘాల నాయకులు, రైతు ప్రతినిధులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బొజ్జా దశరథ రామిరెడ్డి రాయలసీమ అభివృద్ధి, పాలకుల బాధ్యత, పౌర సమాజం అవగాహన అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రజాసంఘాల ప్రతినిధులకు, నంద్యాల పుర ప్రముఖులకు, రైతులకు అవగాహన కలగజేశారు. ఇందులో ముఖ్యంగా శ్రీశైలం రిజర్వాయర్ లో వరద మొదలై 60 రోజులు అయినప్పటికీ శ్రీశైలం నిండుకుండ లాగా 50 రోజుల నుండి ఉన్నప్పటికీ రాయలసీమలో రిజర్వాయర్ లన్నీ వెలవెలబోతున్నాయి. శ్రీశైలం రిజర్వాయర్ నిండుకుండలా ఉన్నప్పుడు పోతిరెడ్డిపాడు నుండి రోజూ నాలుగు టి ఎం సీ లు పొందే అవకాశం ఉంది. దీని ద్వారా ఈ 50 రోజుల కాలంలో 200 టి ఎం సీ ల నీటిని పొంది ఉండాలి. అదేవిధంగా మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా నాలుగు రోజులకు ఒక టీఎంసీ లాగా ఈ 50 రోజుల్లో సుమారు 12 టీఎంసీలు నీటిని పొంది ఉండాలి. మొత్తంగా ఈ రెండు మార్గాల ద్వారా సుమారు 210 టీఎంసీ ల నీటిని పొంది ఉండాలి. కానీ రాయలసీమ రిజర్వాయర్ల నిర్వహణ లోపంతో, ప్రధాన కాలువల లోపంతో కేవలం 80 టీఎంసీలు మాత్రమే నిలువ చేసుకోగలిగింది. సుదీర్ఘకాలం వరద ఉన్నప్పుడు కూడా, నీటిని తీసుకునే మార్గాలు ఉన్నప్పటికీ ప్రాజెక్టుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వల్ల రాయలసీమ సాగునీటి రంగం అనుభవిస్తున్న దుస్థితిని దశరథరామిరెడ్డి వివరించారు. ఆంధ్రప్రదేశ్లో 42 శాతం భూభాగం ఉన్నా గత పది సంవత్సరాలుగా రాష్ట్ర బడ్జెట్లో రాయలసీమకు కేవలం 15 శాతం నిధులు కేటాయించడం వల్లనే రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు శిథిలావస్థకు చేరాయి అన్న విషయాన్ని బొజ్జా వివరించారు. కృష్ణా డెల్టాకు కేటాయించిన 101టీఎంసీ ల నీటిని నాగార్జునసాగర్ - ప్రకాశం బ్యారేజీ మధ్య తెలంగాణ నుండి ప్రవహించే మూసి, పాలేరు, మున్నేరు మొదలైన నదులు నుండి పొందే హక్కును బచావత్ కలగజేసిందని వివరించారు. కానీ ఈ హక్కును నీటిలో కేవలం 20 టి.యం.సి ల నీటిని పొందే అవకాశం ఉందనీ, మిగిలిన నీటిని నాగార్జునసాగర్ ద్వారా శ్రీశైలం నుండి పొందే లాగా జూన్ 18, 19, 2015లో జరిగిన కృష్ణా నది యాజమాన్య బోర్డు సమావేశంలో నిర్ణయం జరిగేలాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం క్రియాశీలకంగా వ్యవహరించింది. ఇంకొక మాటలో చెప్పాలంటే కృష్ణా డెల్టాకు కేటాయించిన నీటిని సముద్రంలోకి పారబోస్తూ ఇటు రాయలసీమ అటు నాగార్జునసాగర్ వాడుకోవాల్సిన నీటిని పొందేలాగా పై సమావేశంలో తీర్మానాలు చేశారు. కృష్ణా డెల్టాకు నాగార్జునసాగర్ దిగువన లభించే కృష్ణా జలాలను వినియోగించుకోకపోతే పోలవరం నిర్మాణం జరిగినా ఇటు రాయలసీమ నీటి హక్కులకు, నాగార్జునసాగర్ నీటి హక్కులకు లేదా అటు పోలవరం ఎడమ కాలవ ద్వారా గోదావరి ఉత్తరాంధ్ర హక్కులకు భంగం కలిగే పరిస్థితులు ఉన్నాయని వివరించారు. ఈ విషయాలపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందని బొజ్జ దశరథరామిరెడ్డి వివరించారు.





ఆంధ్రప్రదేశ్ తెలంగాణ నీటి అవసరాలకు శ్రీశైలం రిజర్వాయర్ అత్యంత కీలకమని ఆ రిజర్వాయర్ యొక్క జీవితకాలం పెంచుకోవడం ఈ ప్రాజెక్టు మీద రెండు రాష్ట్రాల్లో ఆధారపడిన 50 లక్షల ఎకరాల సాగునీటికి అత్యవసరమని వివరించారు. ప్రాజెక్టు జీవిత కాలాన్ని పెంచడానికి ఉన్న ఏకైక మార్గం సిద్దేశ్వరం అలుగు నిర్మాణం అని వివరించారు. అదే విధంగా కృష్ణా నదిలో వరదలు రాకుండా రాయలసీమలో కరువు రాకుండా నివారించడానికి కృష్ణా నది ఎగువన గుండ్రేవుల రిజర్వాయర్, తుంగభద్ర ఎగువ సమాంతర కాలువ, వేదవతి ఎత్తుపోతల పథకం, మాలిగ్నూర్ నుండి తుంగభద్ర వరద కాలువ చేపట్టాలని బొజ్జా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమాలన్నీ నెరవేర్చడానికి రాయలసీమ భూభాగానికి సమానంగా రాష్ట్ర సాగునీటి బడ్జెట్లో 42 శాతం నిధులు రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించాలన్న ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం ముందు ఉంచారు. వెనుకబడిన రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందిన ప్రాంతాలతో సమానాభివృద్ధి చెందడానికి ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన నిధులు, స్పెషల్ పర్పస్ వెహికల్ ద్వారా ప్రత్యేక నిధులు, రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన ప్రత్యేక ప్యాకేజీ నిధులను సాధించాలని కోరారు. రాయలసీమలో నెలకొల్పిన ఎలక్ట్రిసిటీ రెగ్యులేటర్ కమిషన్ కార్యాలయము, మానవ హక్కుల కార్యాలయము, లోకాయుక్త కార్యాలయము , ఉర్దూ యూనివర్సిటీ, లా యూనివర్సిటీ ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నికల ముందు హామీలు ఇచ్చినట్టుగా హైకోర్టు, సీడ్ హబ్, హార్టికల్చర్ కేంద్రాన్ని రాయలసీమ ఏర్పాటు చేయాలని కోరారు. సిడ్ హబ్, హార్టికల్చర్ కేంద్రాల లక్ష్యం నెరవేరాలంటే ఏపీ విత్తానాభివృద్ధి సంస్థ, విత్తన ధ్రువీకరణ కేంద్రము, హార్టికల్చర్ కమిషనరేట్, మార్కెటింగ్, వివిధ మౌలిక వసతులను రాయలసీమలో ఏర్పాటు చేయాలని కోరారు.

రాయలసీమ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికలలో రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కార్యాచరణను ప్రకటించి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సమావేశంలో వక్తలు ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర సమగ్రాభివృద్దిలో అత్యంత కీలకంగా ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణకై కృష్ణా నది యాజమాన్య బోర్డును కర్నూలులో ఏర్పాటు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.నీళ్ళున్నా రాయలసీమ ప్రాజెక్టులకు నీరు ఎందుకు చేరడం లేదు

ప్రకృతి కనికరించినా రాయలసీమ ప్రాజెక్టుల దుస్థితి, కుందూ నదిలో వరదలకు కారణం ప్రకృతా..? హక్కున్న కృష్ణా జలాలనే కృష్ణా డెల్టా వినియోగిస్తున్నదా..?పోలవరం ప్రాజెక్టుతో ఏయే ప్రాంతాలకు ప్రయోజనం? పోలవరం ద్వారా ఆదా అయిన 80 టీఎంసీ లు రాయలసీమ పొందగలదా..?

### శ్రీశైలం ప్రాజెక్టు బహుళార్ధక ప్రాజెక్టే..

కృష్ణా నదిలో వరదల నివారణకు రాయలసీమలో రిజర్వాయర్లు, రాయలసీమలో ఏర్పాటు చేసిన కార్యాలయాల కొనసాగింపు, రాయలసీమ సాగునీటి రంగానికి బడ్జెట్ కేటాయింపులు తదితర అంశాలపై బొజ్జా దశరథరామిరెడ్డి ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ అందిరినీ ఆకట్టుకుంది. ఈ సమావేశానికి రాయలసీమ ఉమ్మడి నాలుగు జిల్లాలనుండి ప్రజా సంఘాల నాయకులు, రైతు సంఘాల నాయకులు, రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# రాష్టానికి జగన్ విఘ్నాలు తొలగాలి

### గణేష్ నిమజ్జనోత్సవంలో పాల్గొన్న మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల సూర్య వాస్తవం ప్రతినిధి:** రాష్ట్రానికి సాధ్యమైనంత త్వరగా జగన్ రెడ్డి విఘ్నాలు తొలగి అభివృద్ధిలో పరుగులు తీయాలని ఆ వినాయకుడిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ , నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబలు అన్నారు .నంద్యాల స్థానిక గాంధీ చౌక్ నందు ఏర్పాటుచేసిన గణేష్ నిమజ్జనోత్సవ కమిటీ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లు అతిథులుగా పాల్గొనడం జరిగింది . ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి లు మాట్లాడుతూ నంద్యాలలో ప్రతి సంవత్సరం లాగానే ఈ ఏడాది కూడా గణేష్ మహోత్సవ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 74 ఏళ్ల వయసులోనూ రాష్ట్రం అభివృద్ధి కోసం, ప్రజల సమస్యలు తీర్చడం కోసం నవయువకుడిగా శ్రమిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మరింత శక్తిసామర్థ్యాలు ఇవ్వాలని ఆ గణపయ్యను వేడుకుంటున్నామన్నారు. నంద్యాల గాంధీచౌక్ నందు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలు



వరసగా రావడంతో వారికి జ్ఞాపకను అందజేయడం జరిగింది . అంతేకాకుండా మళ్లొచ్చే ఉత్సవాల నాటికి ముఖ్యమంత్రి తలపెట్టిన ప్రతి అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా ముందు కు సాగాలని ఆ విఘ్నేశ్వరుడిని ప్రార్థిస్తున్నామన్నారు. నంద్యాల నియోజకవర్గం ప్రజలకు ఏ లోటు రాకుండా చూడాలని, రైతులకు మంచి దిగుబడులు, యువతకు మంచి అవకాశాలను అందించాలని కోరుకున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , టిడిపి రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు , తాతిరెడ్డి తులసిరెడ్డి , గోపిశెట్టి నరసింహారావు , రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి , అశ్విని కుమార్ , గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరి రెడ్డి , గంగిశెట్టి విజయకుమార్ , చింతకాయల సుధాకర్ , ప్రముఖ పారిశ్రామికవేత్త వర్ధంశెట్టి రాజారామ్ , నరహరి విశ్వనాధ్ రెడ్డి, మామిడి నాగరాజు కుమార్ , హైగ్రీవ చారి , గోవిందు నాయుడు , కామిని మల్లికార్జున , చలం బాబు , సానిపల్లె సుదర్శన్ రెడ్డి , బాచం నాగేశ్వర్ రెడ్డి , రంగా పినాకపాణి , చందా చంద్రమోహన్ , చింత సుదర్శన్ రెడ్డి , కౌన్సిలర్ కండే శ్యామ్ సుందర్ లాల్ , అడగాళ్ళ కృష్ణమూర్తి , అవ్వరు గిరినాథ్ , తాళంకి ప్రవీణ్ కుమార్ (గోపి) , ముక్కుమల్ల వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. భవనాశి జువెలర్స్ అన్న ప్రసాదంను ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించి, భక్తుల అందించారు. చిన్న చెరువు వద్ద భక్తి శ్రద్దలతో గట్టి పోలీస్ బందోబస్త్ మధ్య గణనాధులకు నిమజ్జనం చేశారు.

### ఇళ్ల నిర్మాణాలు

# వేగవంతం చేయండి

### - జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల-సూర్య వాస్తవం ప్రతినిధి:** ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద ఇళ్ల నిర్మాణాల ప్రగతి అధ్వానరీతిలో ఉందని పనితీరు మెరుగుపరచుకొని ఈ వారంలో పురోగతి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి హౌసింగ్ ఏఈ, డిఇ లను ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ ఛాంబర్ నుండి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. హౌసింగ్ పీడీ వెంకటసుబ్బయ్య, ఈఈ శ్రీహరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ప్రతిరోజు కనీసం రెండు పూర్తిస్థాయికి పది ఇల్లు స్టేజ్ కన్వర్షన్ స్థాయికి తీసుకురావాలని గత సమావేశంలో ఆదేశించినప్పటికీ ఇంజనీరింగ్ అధికారులు శ్రద్ధ చూపకపోవడం బాధాకరం అన్నారు. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన కింద 2,600 గృహాల లక్ష్యానికి గాను కేవలం 243 మాత్రమే పూర్తిచేసి తొమ్మిది శాతం సాధించారని కలెక్టర్ అన్నారు. నందికొట్కూరు, పాములపాడు, ఆత్మకూరు, ప్యాపిలి, బేతంచెర్ల, మిడుతూరు, జూపాడు బంగ్లా తదితర మండలాలు జీరో శాతం కూడా సాధించలేదనన్నారు. జిల్లా యావరేజ్ లో దాదాపు 15 మండలాలు 10 శాతం పురోగతిని కూడ చూపలేదన్నారు. గృహ నిర్మాణాల పురోగతిపై ప్రతి గురువారం తాను సమీక్షిస్తానని గృహ నిర్మాణాల వేగవంతంపై ప్రత్యేక దృష్టి సారించి పూర్తి చేయాలన్నారు. గృహ నిర్మాణాల లక్ష్యం ఎక్కువ ఉన్న మండలాలు కూడా ఎందుకు చేయలేక పోతున్నారని ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ప్రశ్నించారు. వచ్చే వారానికి ఏదైతే పూర్తి చేస్తామని చెబుతున్నారో దానిపైననే సమీక్ష నిర్వహిస్తానన్నారు. వచ్చే వారానికి 500 గృహాలు పూర్తి కావాలని ఆమె ఆదేశించారు.

### స్వచ్ఛతా హి సేవ

# కార్యక్రమాలు చేపట్టండి

### -అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల-సూర్య వాస్తవం ప్రతినిధి:** ఈనెల 17 నుండి అక్టోబర్ 2 తేదీ వరకు అన్ని గ్రామాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రత ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, డిపిఓ మంజుల వాణి, జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను ఈనెల 17వ తేదీ నుండి అక్టోబర్ రెండో తేదీ వరకు పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతపై ర్యాలీలు, మానవహారాలు, వర్క్ షాపులు నిర్వహించి ప్రజల్లో విస్తృత అవగాహన తీసుకురావాలన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు ప్రారంభించి అన్ని ప్రదేశాలలో శ్రమదాన కార్యక్రమాలు నిర్వహించేందుకు పంచాయతీ, మున్సిపల్ అధికారులు, ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నీటి వనరుల ప్రాధాన్యాన్ని తెలియజేయడం, ప్రభుత్వ భవనాలు, సంస్మరణీయ స్థలాల సమీపాల్లో పారిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. వ్యర్థాలు లేని భారతదేశాన్ని సాధించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అంతకుముందు రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ దివాస్, స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కొరకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి అధిక ప్రాధాన్యతనిచ్చి నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమ అమలుపై ప్రజలలో అవగాహన కల్పిస్తూ విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన పరికరాల సామాగ్రి కొనుగోలు చేయాలని సూచించారు. చెత్త నుంచి సంపద సృష్టించే అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మురికి కాలువలను శుభ్రం చేయడం, చెత్త నిల్వలు లేకుండా చూడాలన్నారు.

## పోషకాహారంతో తల్లీబిడ్డలు క్షేమం



**దువ్వూరు-సూర్య వాస్తవం :** ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని కానగూడూరు ఐసీడీఎస్ సూపర్వైజర్ జి.సౌజన్య పేర్కొన్నారు. గురువారం కానుగుదురు సెక్టార్ లోని నేలటూరు 2 అంగ న్వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషకాహార మాసోత్సవాలలో సూపర్వైజర్ జి.సౌజన్య హాజరై మాట్లాడుతూ రోజు వారి ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు క్రమం తప్పకుండా తీసుకోవడంతో బాలింతలు,గర్భిణులు రక్తహీనత నుంచి దూరంగా ఉండొచ్చన్నారు. స్త్రీలు గర్భం దాల్చినప్పటి నుంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు మాధవి, అనంతలక్ష్మి, ఆయా ఓబులమ్మ కిషోర్ బాలికలు పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.


## రాయలసీమ వెనుకబాటుకు కారణం రాయలసీమ వాసులదే..!

### -రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఏవీ రమణ



**మైదుకూరు-సూర్య వాస్తవం:** రాయలసీమ సాగునీటి సాధన సమితి అధినేత బొజ్జ. దశరథ రామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో రాయలసీమ అభివృద్ధి చెందకపోవడానికి ఇప్పటివరకు రాయలసీమలో రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం వహించిన వారు ఎమ్మెల్యేలగా, ఎంపీలుగా ఎన్నికైన వారేననీ రైతు సేవా సమితి కడప జిల్లా అధ్యక్షులు ఏవి.రమణ అన్నారు. నంద్యాలలో రాయలసీమ అభివృద్ధి భవిష్యత్ కార్యాచరణ సదస్సులో రమణ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రముగా ఉన్నప్పుడు గానీ రాష్ట్రం తెలంగాణ నుంచి విడిపోయిన తర్వాత గాని ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రిగా, ఎక్కువ శాతం రాయలసీమ వాసులు ముఖ్యమంత్రిగా ఉండడంతో ఎమ్మెల్యేలు గానీ, ఎంపీ లు గాని తమ నియోజకవర్గ సమస్యల పైన తమ ప్రాంత సమస్యల పైన గాని ఎవరు కూడా పార్టీలను గాని ప్రభుత్వాలన్ని కానీ ప్రశ్నించలేదని ఈ పరిస్థితి ఉన్నంతకాలం రాయలసీమ అభివృద్ధి చెందదని రాయలసీమ అభివృద్ధి చెందాలంటే రాయలసీమ ప్రత్యేక రాష్ట్రముగా ఏర్పడితే రాయలసీమ రాష్ట్ర నిధులతో పాటు కేంద్రం నుంచి రావలసిన నిధులతో రాయలసీమలోసాగు నీటి ప్రాజెక్టులను నిర్మించుకొని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమలు నిర్మించుకొని రాయలసీమ అభివృద్ధి పరుచుకోవచ్చుని రమణ అన్నారు. రాయలసీమ ఈ రాష్ట్రంలో కలిసి ఉన్నంతకాలం అభివృద్ధి చెందదు అన్నారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా నుండి ఆర్టిపిపి కార్మిక యూనియన్ నేత వి. సుబ్బిరెడ్డి రైతు సేవ సమితి నేత రామాంజనేయరెడ్డి, రాష్ట్ర అభివృద్ధి వేదిక నాయకుడు గంజికుంట తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీ సుబ్బరాయుడి మృతికి సంతాపం




**దువ్వూరు-సూర్య వాస్తవం :** దువ్వూరు మండలం, దాసరపల్లె కు చెందిన వైసీపీ నాయకులు నీలాపురం ఎంపీటీసీ.సభ్యులు, నాయినేని సుబ్బరాయుడు (73) బుధవారం సాయంత్రం మృతిచెందగా విషయం తెలుసుకున్న వైసిపి నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి గురువారం దాసరిపల్లి గ్రామం వెళ్లి మృతదేహంనకు పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటసుబ్బారెడ్డి మాట్లాడుతూ మంచి మనిషి నిజాయితీకి నిలవటద్దమని ఆయన సంపాదన మంచితనమేనని వైసీపీ నేత, ఏపీ ఎస్ఆర్టిసి మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కొనియాడారు. గురువారం ఉదయం దాసర పల్లెలోని మృతుని స్వగృహంలో నాయినేని సుబ్బరాయుడు మృతదేహం పై రెడ్యం పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్తపరిచారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి ధైర్యం చెప్పారు. అలాగే మాజీ జెడ్పిటిసి సభ్యులు గోపిరెడ్డి బాబు, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సంయుక్త కార్యదర్శి ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి,వైకాపా నాయకులు సంఘన హరినాదరెడ్డి ఇరగం రెడ్డి పద్మనాభ రెడ్డి, సర్పంచులు మంచాల రాజగోపాల్ రెడ్డి,పల్లె రామయ్య,తుమ్మల మస్తాన్ రెడ్డి, దాధన పద్మనాభరెడ్డి, ముదుమాల మహానందిరెడ్డి, తదితర నాయకులు మృతదేహం లో పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.

# ప్రజలందరికీ మెరుగైన వైద్యం

### -పేదవారికి వరం104 వాహనం - గర్భవతులకు పరీక్షలు - డాక్టర్ షేక్ రోషిణి



**దువ్వూరు-సూర్యవాస్తవం:** గ్రామీణ ప్రాంతప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా 104 వాహనం ద్వారా గ్రామాలలోని ప్రజలకు వైద్యం అందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారిని డాక్టర్ షేక్ రోషిణి పేర్కొన్నారు. గురువారం దువ్వూరు మండలంలోని చిన్న సింగన పల్లె గ్రామంలో 104 వాహనం ద్వారా రోగులకు పరీక్షలు నిర్వహించి ముందు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ షేక్ రోషిణి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతూ వుండటంతో ప్ర జలలో విశేష స్పందన లభిస్తుంది. ముఖ్యంగా మండలంలోని ప్రతి గ్రామంలో రోజుకొక ఊరు చొప్పున వుదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నెలలో మొత్తం 26 రోజులు గ్రామాలకు వెళుతూ సాధారణ రోగాల నుండి మధు మేహం,బ్లడ్ ప్రెషర్, క్షయ, కుష్టు, మలేరియా, డెంగ్యూ, టైపా యిడ్, తదితర రోగాలకు అవగా హన కల్పించడమే కాకుండా ఆయా రోగాలకు మెరుగైన మందులను అందిస్తూ, అలాగే గర్భిణీ స్త్రీలకు ఎత్తు, బరువు కొలతలతో పాటు రక్త శాతాన్ని వివరించి తల్లికి మందులను అందిం చడమే కాక, బిడ్డ ఎదుగు దలకు కావలసిన పౌష్టిక ఆహారం గురించి అవగాహన కల్పిస్తూ, బిడ్డ పుట్టినప్పటి నుంచి ఎటువంటి రోగాలు బిడ్డకు దరిచేరకుండా సరైన సమయంలో బిడ్డకు టీకాలను అందిస్తూ, ప్రభుత్వఆస్పత్రుల్లో చేసే సుఖ ప్రసవం గురించి తెలుపుతూ, ప్రభుత్వంద్వారాప్రభుత్వ వైద్యశా లల్లో అందిస్తున్నరవాణా సౌకర్యం, అత్యవసర చికిత్స దీర్ఘ కాలిక రోగులకు ప్రభుత్వం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయాన్ని ప్రతి ఒక్కరికీ వివరిస్తూ, ముఖ్యంగా గుండె జబ్బులకు వారికి 104 వాహనంలో ఈసీజీ మరియు కొన్ని రకాల మందులు అందిస్తూ, మంచంలో నుండి లేచి నడవలేని దీర్ఘ కాలిక, మరియు యాక్సిడెంటల్ కేసులను పరిశీలించి వారికి ఇంటి దగ్గరే టెస్టులుచేసి సరైన మందులను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కాన్సెప్ట్ విధానం ద్వారా దాదాపు 14 రకాలపరీక్షలు 65 రకాల మం దులను అందించడం జరుగుతుందని ప్రభుత్వం అందించే అవకాశాన్ని ప్రతిఒక్కరుసద్వినియోగం చేసుకోవా లని ప్రజలకు డాక్టర్ రోషిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ హరిచందన, ఏఎన్ఎం తులసి కుమారి,104 డీఈవో రామచంద్రారెడ్డి,104 ఆపరేషన్ హెల్త్ అసిస్టెంట్ వై. పి. వెంకటరెడ్డి, ఆశ కార్యకర్త అరుణ, గ్రామ స్తులు గర్భవ తులు, బాలింతలు పాల్గొన్నారు.

# ఆగిపోయిన పేదల ఇళ్ల నిర్మాణం

### - డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి



**కడప-సూర్య వాస్తవం:** వైకాపా, టిడిపి ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా పేదల ఇళ్ళ నిర్మాణ కార్యక్రమం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది అని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఎన్ తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లి లో పేదల ఇళ్ళ నిర్మాణ కాలనీని కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ..... కూడు,గూడు,గుడ్డ ఈ మూడూ మానవుని కనీస అవసరాలు అన్నారు. ఇల్లు కట్టి చూడు,పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు.సొంత ఇల్లు కట్టుకోవడం సామాన్యునికి ఎంత కష్టమో దీనినిబట్టి తెలుస్తోందనీ అందుకే 50 ఏళ్ల క్రిందటే 1975 లో నాటి భారత ప్రధాని ,కాంగ్రెస్ అగ్ర నేత శ్రీమతి ఇందిరా గాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం క్రింద అందరికీ ఇల్లు సూత్రాన్ని చేర్చి పేదలకు ఇల్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటినుండీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పేర్లతో పేదలకు ఇల్లు నిర్మిస్తున్నాయన్నారు. 2004 నుంచి 2014వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వాలు 60 లక్షల ఇళ్లు పేదలకు నిర్మించాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన టిడిపి.వైకాపా ప్రభుత్వాలు ఈ పథకాన్ని నిర్లక్ష్యం చేశాయి. ప్రత్యేకించి జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. వన్ టైం సెటిల్మెంట్ పేరుతో అప్పటికే నిర్మించి ఇచ్చిన ఇళ్లపై 5వేల కోట్ల రూపాయలు పేదల నుండి వసూలు చేసింది. 5 ఏళ్లలో 25లక్షల ఇళ్లు నిర్మిస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి కేవలం లక్ష ఇల్లు కూడా నిర్మించలేదు అని తులసి రెడ్డి ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఇచ్చే లక్షా ఎనభై వేల రూపాయలు ఏ మాత్రం సరిపోవడం లేదని,ఎక్కువ వడ్డీకి అప్పు తెచ్చి లబ్ధిదారులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక ఇళ్ళ నిర్మాణ కార్యక్రమం ఆగిపోయిందని వివిధ నిర్మాణ దశల్లో వున్న ఇళ్ళ నిర్మాణాన్ని పూర్తి చేయాలని,మంజూరు కాకవున్న అర్హులకు మంజూరు చేసి నిర్మించి ఇవ్వాలని తులసి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీయుతులు అమర్ నాథ్ రెడ్డి, రామకృష్ణ, ఉత్తన్న,సుబ్బరాయుడు,వెంకటేశు,నాగరాజు,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# 17 నుంచి 'స్వభావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛతా'

### - జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి



**రాయచోటి-సూర్య వాస్తవం:** ఈనెల 17 నుంచి జిల్లా వ్యాప్తంగా "స్వభావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛతా" కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి స్వచ్ఛతాహి సేవ అంశంలో భాగంగా... రాష్ట్రంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు చేపట్టనున్న "2024 స్వభావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛతా" కార్యక్రమాలకు సంబంధించి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాల్గొన్నారు. వీసీ అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను పంచాయతీలు, గ్రామాలు, పట్టణాలలో విస్తృతంగా అమలు చేసి పారిశుధ్యం నిర్వహణను మెరుగుపరచాలన్నారు. ఈనెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు "2024 స్వభావ్ స్వచ్ఛతా - సంస్కార్ స్వచ్ఛతా" కార్యక్రమాలలో భాగంగా... స్వచ్ఛతాహి భాగ్యదారి, సంపూర్ణ స్వచ్ఛత, సఫాయి మిత్ర సురక్ష సివిర్స్ అంశాలలో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా కార్యక్రమాలను అమలు చేయాలన్నారు. అక్టోబర్ 2ను మహాత్మునికి నివాళిగా స్వచ్ఛభారత్ దివస్ గా పరిగణిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాలకు సంబంధించి ఈ నెల 13 నుంచి 17 వరకు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, ఇందుకు రోజువారి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలన్నారు. సూచించారు. జిల్లావ్యాప్తంగా పరిశుభ్రత లక్ష్య యూనిట్లు (క్లీన్లీనెస్ టార్గెట్ యూనిట్స్)ను గుర్తించాలని సూచించారు. పంచాయితీలు, మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి. ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణ పక్కగా చేయాలి. ఈ కార్యక్రమాలలో ప్రజలను కూడా విరివిగా భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు. క్లీన్ అండ్ గ్రీన్ పచ్చదనం పెంపులో భాగంగా కార్తీక వనమహోత్సవం వరకు జిల్లా వ్యాప్తంగా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. పారిశుద్ధ్యం నిర్వహణ అంశంలో సాంస్కృతిక పండుగలు నిర్వహించాలన్నారు. ఘన, ద్రవ్య వ్యర్థాల నిర్వహణను తప్పనిసరిగా చేయాలని, ఇందుకు ప్రజల్లో కూడా అవగాహన కలిగించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో డ్వామా, పంచాయతీ, జిల్లా పరిషత్ డిఆర్డిఏ, ఆర్డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యం, ఐసిడిఎస్, మున్సిపల్, టూరిజం తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రత్యేక శిబిరాలతో వైద్య సేవలు అందించాలి





**కుప్పం-సూర్య వాస్తవం:** కుప్పం నియోజకవర్గంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమిత్ కుమార్ గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కుప్పం డివిజన్ స్థాయిలో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాఖలలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరుపైన జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో కుప్పం డివిజన్ స్థాయిలో ఒక ప్రత్యేక సర్వే ద్వారా రక్తపోటు, మధుమేహం, లివర్, కిడ్నీ, అంగవైకల్యం,కలిగిన వ్యక్తుల వివరాలు సేకరించి సచివాలయ స్థాయిలో ఏఎన్ఎం, ఎంఎల్ హెచ్పీలు లు సంయుక్తంగా కలిసి 45 రోజులలో ఈ కార్యక్రమం పూర్తి చేయాలనీ ఆదేశించారు. ఈ సర్వే మూలంగా వ్యాధిగ్రస్తుల వివరాలు సేకరించిన తరువాత పూర్తి చికిత్స, మరియు లివర్, కిడ్నీ, అంగ వైకల్యం, ఉన్న వారికి ప్రత్యేక ఆరోగ్య శిభిరాలు ద్వారా చికిత్స అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. సర్వేకు సంబంధించిన పరికరాలు సదరు సర్వే సిబ్బంది కి అందచేయాలనీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో కడ ప్రత్యేక అధికారి వికాస్ మర్మత్, జిల్లా వైద్యాధికారిణి ప్రభావతి దేవి,డిఐఓ డాక్టర్ హనుమంత రావు, డిప్యూటీ డిఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాస్ డపిఎంఓ డాక్టర్ హర్ష వర్ధన్, నాలుగు మండలాల వైద్యాధికారులు, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, ఏఎన్ఎంలు సిహెచ్ ఓలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**కుప్పం ప్రాంతీయ ఆసుపత్రి తనిఖీ**

కుప్పం ప్రాంతీయ ఆసుపత్రిని గురువారం చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కడ పిడీ వికాస్ మర్మత్ తో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా రోగులకు అందిస్తున్న వైద్య సేవల పై డాక్టర్లతో కలెక్టర్ మాట్లాడారు. అనంతరం ఆ ఆస్పత్రి లో మేల్, ఫిమేల్ వార్డులను ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్యామల, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉచిత కంటి అద్దాల పంపిణీ





**శాంతిపురం-సూర్య వాస్తవం:** శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం బుధవారం చిత్తూరు కలెక్టరు సుమిత్ కుమార్ చేతుల మీదుగా జరిగింది. కడ పిడి వికాస్ మర్మత్, రాష్ట్ర టిడిపి సమన్వయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటిఅద్దాలను పంపిణీ చేశారు, గత నెల ఆగస్టు 24 వ తారీఖున శాంతిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరంలో 575 మందికి వివిధ రకాలైన కంటి పరీక్షలు నిర్వహించారు.

అందులో 338 మందికి కంటి అద్దాలను వాడాలని వైద్యులు సూచించారు.బుధవారం ఆ కంటి పరీక్ష చేసుకున్న వారికి వీటిని అందజేశారు, ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు విశ్వ,జని, ఉదయ్ కుమార్, నాగరాజు, మఠం సర్పంచ్ మురళి, రాజారెడ్డి, వైద్యాధికారులు వంశీకృష్ణ, హరినాథ్ రెడ్డి, సూపర్వైజర్ లు కోదండ పాణి, శశికళ, ఏఎన్ఎంలు,సిహెచ్ ఓలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తంగరాజు
# జన్మదిన వేడుకలు



**పాలసముద్రం-సూర్య వాస్తవం:** తెలుగు దేశం పార్టీ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గం యువత కార్యనిర్వాక కార్యదర్శి తంగరాజు జన్మదిన వేడుకలను పాలసముద్రం మండలం తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో తెలుగు తమ్ముళ్లు గురువారం ఘనంగా నిర్వహించారు.బుధవారం అర్ధరాత్రి నుండి వేడుకలు ఘనంగా సాగాయి. జీడీ నెల్లూరు నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీలకు అతీతంగా రాజకీయ ప్రముఖులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వేడుకల్లో హజరయ్యారు. తంగరాజు జన్మదినం సందర్భంగా ప్రత్యేకంగా పలువురు తీసుకొచ్చిన కేక్‌లను కట్ చేయించి ఆయనకు తినిపించారు. శాలువాలు కప్పి, బొకేలు, జ్ఞాపికలను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబశివన్, మండల మాజీ అధ్యక్షుడు శీను రాజు , ఎక్స్ ఎంపిటిసి బాబు నాయుడు, నాయకులు గోపిరాజు, ఏలుమలై , సతీష్, చంద్రబాబు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల వద్ద అన్నదానం

**బంగారుపాల్యం, సూర్య వాస్తవం:** చిత్తూరు జిల్లా,బంగారుపాల్యం మండల కేంద్రంలోని ఓటీకే స్ట్రీట్ లో భారీ వినాయక మండపం నందు మండల కేంద్రానికి చెందిన రియల్ ఎస్టేట్ శంకర ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర మాట్లాడుతూ వినాయక చవితి నుండి నిమజ్జనం రోజు వరకు ప్రతిరోజు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఆదివారం రోజు వినాయక నిమజ్జనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కోకా ప్రకాష్ నాయుడు, మురారి, సుదర్శన్,దినకర్ శెట్టి, యూత్ సభ్యులు వంశి, జగదీష్, ప్రకాష్, యోగి, బాలు, హేమంత్, ఆఫ్రిది,చంద్ర, గోకుల్, చంద్ర, స్నేహిత్, పునీత్, భరత్, నికేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసీ బస్సును ఢీకొన్న ద్విచక్ర వాహనం



**శాంతిపురం-సూర్య వాస్తవం:** కుప్పం పలమనేరు జాతీయ రహదారిపై కడపల్లి వద్ద గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కుప్పం నుంచి పలమనేరు వైపుకు వెళుతున్న ఆర్టీసీ బస్సును శాంతిపురం కుప్పం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి ఆర్టిసి వాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్ర వాహనం పై పి ఈ ఎస్ వైద్య కళాశాల సమీపంలోని బెగ్గిలి పల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), నిర్మల (32) గాయపడగా వారి కుమారుడు ప్రదీప్ ( 12)కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనానికి ఫోన్ చేసి అదే వాహనంలో క్షతగాత్రులను స్థానిక పీఈఎస్ ఆసుపత్రికి తరలించారు. అయితే అదుపుతప్పి మీదకు దూసుకొస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ డ్రైవర్ తప్పించి సుమారు 30 మంది ప్రయాణికుల ప్రాణాపాయం నుంచి కాపాడాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

## గోవధకు తరలిస్తున్న ఆవులను కాపాడిన పోలీసులు



**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** గోవధకు తరలిస్తున్న పశువుల లారీని, గురువారం తట్టివారిపల్లె ప్రజలు అడ్డుకుని పోలీసులకు అప్ప జెప్పారు. మదనపల్లె తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపిన వివరాల మేరకు .. అనంతపురం నుంచి తమిళనాడు రాష్ట్రం, సేలంలోని గోవధశాలకు 46 ఆవులను కొందరు వ్యక్తులు అక్రమంగా లారీలో తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం అందిందన్నారు. తాను వెంటనే సిబ్బందితో వెళ్లి లారీ డ్రైవర్, క్లీనర్ ను అదుపులోకి తీసుకుని, గోవధకు తరలిస్తున్న పశువుల్ని కాపాడి, స్థానిక గోశాలకు పంపించామని తెలిపారు. కాగా లారీ డ్రైవర్ క్లీనర్ ల పై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు

ఫోటో ఉంది

## రైతుపై హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితుడి అరెస్ట్



**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** రైతుపై హత్యాయత్నానికి పాల్పడ్డ నిందితున్ని అరెస్టు చేసినట్లు మదనపల్లె తాలూకా సిఐ కళావెంకటరమణ తెలిపారు. మండలంలోని పెంచుపాడు పంచాయతి, పనసమాను కుంటకు చెందిన రైతు నారాయణ (63)కు అదే ఊరులో ఉండే శ్రీరాములు, చెన్నకేశవులుకు గత కొన్నేళ్ళుగా ఆస్తితగాదాలు ఉండేవన్నారు. ఈ క్రమంలో ఈ నెల 3న రాత్రి నారాయణ ఇంట్లో ఉండగా, తన ప్రత్యర్థి చెన్నకేశవులు అతని ఇంట్లోకి వెళ్ళి కత్తి, కర్రలతో దాడిచేసి హత్యాయత్నంకు పాల్పడ్డాడని సీఐ తెలిపారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రైతు నారాయణను కుటుంబీకులు అదే రోజే మదనపల్లికి తీసుకువచ్చి జిల్లా ఆస్పత్రిలో వైద్య శిఖ్యతలు అందించారని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పిదప నిందితుడు చెన్నకేశవులు పెంచుపాడు సమీపంలో ఉండగా అదుపులోకి తీసుకుని, అరెస్టుచేసినట్లు తెలిపారు.

## ట్రాక్టర్ ఢీకొని మహిళకు తీవ్ర గాయాలు

**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** రోడ్డు పక్కన నిలబడిన మహిళను ట్రాక్టర్ ఢీకొని తీవ్రంగా గాయపడినట్లు 2టౌన్ సిఐ రామచంద్ర తెలిపారు. మదనపల్లె శ్రీవారినగర్ లో ఉంటున్న లక్ష్మీదేవి(45) కురబలకోట మండలం, సర్కారుతోపులో ఉన్న వ్యవసాయ బోరువద్దకు వెళ్లాలని గురువారం ఉదయం స్థానిక రింగురోడ్డు వద్దకు వచ్చిందన్నారు. అదే సమయంలో చంద్రాకాలనీ వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ట్రాక్టర్ రోడ్డు పక్కన నిలబడి ఉన్న లక్ష్మీదేవి(45)ని ఢీకొని వెళ్లి పోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలని వెంటనే స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించి, ఆమె పరిస్థితి విషమంగా ఉందని మెరుగైన వైద్యం కోసం వెంటనే తిరుపతి రుయాకు వెళ్లాలని సూచించారు. కుటుంబీకులు ఆమెను రుయాకు తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు

## బైకు అదుపుతప్పి పడి రైతుకు తీవ్ర గాయాలు

**మదనపల్లె క్రైమ్-సూర్య వాస్తవం:** బైకులో నుంచి కింద పడి ఓ రైతు తీవ్రంగా గాయపడి జిల్లా ఆసుపత్రిలో చేరాడు. ఘటనపై బాధితుని కుటుంబీల కథనం.. నిమ్మనపల్లె మండలం, ఆరిపిరెడ్డిగారిపల్లెకు చెందిన రైతు నగరం శీనప్ప(52) గురువారం ఉదయం సొంతపనిపై బైకులో మదనపల్లెకు బయలు దేరాడు. స్కూటర్ మార్గమధ్యంలోని పిట్టావాండ్లపల్లె మలుపువద్దకు రాగానే, ఎదురుగా వస్తున్న వాహనానికి సైడు ఇవ్వబోయిన శీనప్ప బైకు అదుపుతప్పింది. దీంతో కింద పడ్డ శీనప్ప తీవ్రంగా గాయపడగా, స్థానికులు గుర్తించి అతని వెంటనే 108 వాహనంలో మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆస్పత్రి అత్యవసర విభాగం డాక్టర్లు పరీక్షించి మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటున్నాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## బాల్య వివాహాలు అడ్డుకోవాల్సిన బాధ్యత అందరిదీ

**- ఐసీడీఎస్ పీడీ డాక్టర్ శ్రీదేవి**



**అనంతపురం క్రైం-సూర్య వాస్తవం:** బాల్య వివాహాలు సమాజానికి చేటని, వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులు, సమాజంలోని పౌరులపై ఉందని ఐసీడీఎస్ పీడీ డాక్టర్ బళ్లారి నున్న శ్రీదేవి అన్నారు. అప్పుడే సమాజం వేగంగా అభివృద్ధి చెందుతుందని అభిప్రాయపడ్డారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పిలుపు మేరకు అనంతపురంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వారి కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన జీఓ ఎంఎస్ నెంబర్ 31, 39 గురించి పీడీ శ్రీదేవి వివరించారు.బాల్య వివాహ నిరోధక అధికారుల బాధ్యతలు, కర్తవ్యాల గురించి అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు అడ్డుకోవాల్సిన బాధ్యత ఐసీడీఎస్, అంగన్వాడీ టీచర్లదే కాదన్నారు. ఇప్పటి వరకు ఈ బాధ్యత ఐసీడీఎస్, అంగన్వాడీలే చూశారని పేర్కొన్నారు. ఇక నుంచి గ్రామ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు బాధ్యులేనన్నారు. మండల, డివిజన్, జిల్లా స్థాయిలోనూ అన్ని శాఖల అధికారులు భాగస్వామ్యం కావాల్సిందేనని స్పష్టం చేశారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అని స్థాయిలోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా చేసిన చట్టాలు, జారీ చేసిన ఉత్తర్వులపై అన్ని వర్గాల వారిలో చైతన్యం తీసుకురావాలని కూడా కోరారు. బాల్య వివాహం చేసినా, ప్రోత్సహించినా, హాజరైనా అటువంటి వారందరూ శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు.

**బాల్య వివాహాలు చేస్తే జైలుకే: జెడ్పీ సీఈఓ ఓబుళమ్మ**

బాల్య వివాహాలు చేస్తే జైలు జీవితం తప్పదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జెడ్పీ సీఈఓ ఓబులమ్మ కోరారు. బాల్య వివాహాలను నిరోధించడంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉందన్నారు. గ్రామస్థాయిలో వీఆర్వో పంచాయతీ సెక్రటరీ, మహిళా పోలీసులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాల్య వివాహ విషయం తెలియగానే పెళ్లి కుమార్తె, పెళ్లి కొడుకును కలసి బాల్య వివాహం వలన కలిగే అనర్థాలను తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహల వల్ల ఆరోగ్యపరంగానే కాకుండా మానసికంగా, శరీరకంగా, సామాజిక పరంగా కూడా ఇబ్బందులు ఎదుర్కొంటారని డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ ఈబీ దేవి హెచ్చరించారు. శారీరక ఎదుగుదల లేక, చిన్న వయస్సులోనే గర్భ దాలిస్తే, కొన్ని సమయాల్లో తల్లీబిడ్డ ఇద్దరూ మరణించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిపై తల్లిదండ్రులకు, డ్రాప్ అవుట్ పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ మంజునాథ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా యుక్త వయసు పిల్లల పాపులేషన్, బాల్య వివాహల సూచికలను తెలియజేశారు. అనంతపురం రూరల్ సీడీపీఓ ధనలక్ష్మి, శింగనమల సీడీపీఓ ఉమా శంకరమ్మ, చైల్డ్ లైన్ డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ కృష్ణమాచారి, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, అనంతపురం అర్బన్, రూరల్, ఆత్మకూరు, కూడేరు, రాప్తాడు మండలాల వైద్యాధికారులు, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, డీ.ఆర్.డీ.ఏ, మెప్మా అధికారులు, మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న అనంపల్లి గ్రామస్తులు




**పామిడి రూరల్-సూర్య వాస్తవం:** గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం లో ఒక మనిషికి కష్టం వచ్చింది అని వినీ ఆగ్రామం మొత్తం స్పందించింది మనిషికి మనిషి తోడుగా ఉండాలని గ్రామం మొత్తం ఒకటిగా నిలబడ్డారు స్వచ్చందంగా తమవంతు సాయం అందించారు అనుంపల్లి గ్రామ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో విజయవాడ వరదబాధితుల సహాయార్థం గుంతకల్లు నియోజకవర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు, పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ మరియు పామిడి మండల సమన్వయకర్త ఆర్. ఆర్. రమేష్. ఆదేశాల మేరకు పామిడి మండలం అనుంపల్లి గ్రామం లో విజయవాడ వరదబాధితులకు ఆసరాగా నిలవడం కోసం గ్రామ టీడీపీ నాయకులు అందరు ఏకమై ఊరు మొత్తం తిరిగి 50పాకెట్ల బియ్యం సేకరించి పామిడి మండల సమన్వయకర్త ఆర్. ఆర్. రమేష్ అందజేశారు.ఆర్. ఆర్. రమేష్ మాట్లాడుతూ మండలం మొత్తం అనుంపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలని స్నేహాభావం తో మెలిగితే ఎంతటి పనినైనా సాధించవచ్చు అని అనుంపల్లి గ్రామస్తులను మెచ్చుకున్నారు. ఈ కార్యక్రమం లో అనుంపల్లి గ్రామ టీడీపీ ముఖ్యనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# దారి తప్పుతున్న రేషన్ బియ్యం..!

**❖ రేషన్ బియ్యం సక్రమంగా సరఫరా చేయాలి ❖ అక్రమ రవాణా చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి**

**❖ గత ప్రభుత్వం లాగా ఇళ్ల వద్దకే బియ్యం పంపిణీ చేయాలి ❖ సిపిఎం డిమాండ్**






**అనంతపురం క్రైం-సూర్య వాస్తవం:** రేషన్ బియ్యం తరలించడంలో అనంతపురం జిల్లా కేరాఫ్ గా మారింద...,?పేద,మధ్య తరగతి ప్రజల కోసం అందిస్తున్న ఉచిత బియ్యం అంగడి సరుకులా మారిందనీ లబ్ధిదారులు మొరపెట్టుకుంటున్నారు. పేదలకు అందాల్సిన ప్రజా పంపిణీ బియ్యం దళారుల చేతిలో పడి రూట్ మారుతుంది. రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టిన కూడా బియ్యం అక్రమ రవాణా జరుగుతూనే ఉంది. రేషన్ దుకాణాల నుంచి లబ్ధి దారుల ఇళ్లకు చేరకముందే దళారుల పాలవుతుంది. బియ్యాన్ని దళారులు నల్లబజారుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే వాదనలు బలంగా వినిపిస్తుంది. అడ్డదారిలో నంపాదించటానికి అలవాటుపడ్డ కొందరు డీలర్లు లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యాని పక్కదారి పట్టిస్తున్నారు....

**పేదల కడుపు కొడుతున్న రేషన్ డీలర్లు**

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్టోర్ బియ్యాన్ని కొందరు డీలర్లు అక్రమ రవాణా చేస్తూ పేదల కడుపు కొడుతున్నారని తెలుపుతూ గురువారం నాడు సిపిఎం పార్టీ ఒకటవ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయం దగ్గర ధర్నా చేశారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని కొందరు డీలర్లు, అధికారులతో కుమ్మక్కై అక్రమంగా రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్న చూచిచూడునట్లు అధికార పార్టీ నాయకులు వ్యవహరించడం తగదని పేదల కడుపు కొడుతున్న ఏ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదని తెలిపారు . అర్బన్ పరిధిలో ఉన్న స్టోర్ల లో ఇప్పటికే బియ్యం, సరుకులు 74 శాతం సరఫరా చేసామని అధికారులు లెక్కలు చూపిస్తున్న సిపిఎం పార్టీ కొన్ని ప్రాంతాల్లో సర్వే చేసి ఏ ఏ స్టోర్ లలో ఎంతమంది లబ్ధిదారులకు బియ్యం సరఫరా చేశారో తహసిల్దార్ కు వినతిపత్రం సమర్పించారు. కావున ప్రభుత్వ అధికారులు చెబుతున్న లెక్కలకు సిపిఎం పార్టీ చేసిన సర్వేకు పొంతన లేదని విమర్శించారు. కొన్ని స్టోర్ల లో 25 శాతానికి మించి సరఫరా చేయలేదని తెలిపారు . బియ్యం చక్కెర కోటాను అక్రమంగా అమ్ముకున్నారని తెలిపారు. కొన్ని స్టోర్ల దగ్గర దగ్గర బఫర్ స్టాక్ ఉన్నదని తెలుపుతున్న ఏ స్టోర్ లో కూడా స్టాక్ లేదని ఆ సరుకు ఇతర మార్గాల్లో రాష్ట్ర సరిహద్దు దాటిందని తెలిపారు. అనంతపురం అర్బన్ లో 58 326 మంది రేషన్ కార్డు ఉండగా వారికి ఇప్పటిదాకా 44 067 మందికి మాత్రమే బియ్యం సరఫరా చేశారని అధికారులు లెక్కలు చెప్పారని కానీ ఇది కూడా నమ్మశక్యంగా లేదని తెలిపారు. దీనికి ప్రధాన కారణం కొందరు స్టోర్ డీలర్లు పేదలతో రెండు నెలలు స్టోర్ బియ్యం తీసుకోలేదు కావున మీకు కార్డు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రద్దు అవుతున్నదని కావున మీరు వేలిముద్ర వేయాలని చెప్పగా ప్రజలు కార్డు ఎక్కడ రద్దు అవుతుందేమో అని భయపడి స్టోర్ డీలర్ దగ్గర వేలిముద్రలు వేసినట్లు సిపిఎం దృష్టికి వచ్చిందని తాహసీల్దార్ గారికి వివరించారు. అదేవిధంగా షాప్ నెంబర్ 1225028 పరిధిలో మొత్తం రేషన్ కార్డులు 680 ఉండగా అలాట్ చేసిన బియ్యం 11 425 కేజీలు. గత మూడు రోజుల క్రింద దాకా బియ్యం పంపిణీ చేసినది 61 మందికి మాత్రమే మిగిలిన లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయలేదని తెలిపారు అలాగే 600 చక్కెర ప్యాకెట్లు వస్తే 61 మందికి మాత్రమే పంపిణీ చేశారు ఇలాగే షాప్ నెంబర్ 06లో 872 కుటుంబాలు ఉంటే వారికి కూడా బియ్యం సరఫరా చేయలేదని కానీ 20600 కేజీలు బఫర్ స్టాక్ ఉన్నట్లు తెలుపుతున్నారని కానీ రికవరీ మాత్రం చేయలేదని తెలిపారు. అలాగే షాప్ నంబర్ 90, 130, 125, 12, 10, 52 ,31 ,47, 24, 23, 44 ,89 షాపులలో ఇదే పరిస్థితి ఉందని ఎమ్మార్వో గారికి తెలిపారు. అదేవిధంగా పేదలు బియ్యం కోసం పనులను వదులుకొని రోజుల తరబడి నగరంలో ఉన్న పలు ప్రాంతాలలో ఎక్కడ బియ్యం వేస్తున్నారో అని తిరుగుతున్నారని వారిని ఇబ్బంది పెట్టడం ప్రభుత్వానికి తగదని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ మీరు చెప్పిన విషయాల మీద అధికారులతో చర్చించి 20 రోజుల లోపల సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని ఎక్కడ కూడా బియ్యం అక్రమ రవాణా కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ,అలాంటి అక్రమ రవాణా కు పాల్పడిన వారి పట్ల పీడీ యాక్ట్ అమలు చేస్తామని తెలిపారు .అలాగే ప్రభుత్వంతో మాట్లాడి రేషన్ కార్డులు రద్దు కాకుండా చూస్తామని ప్రభుత్వ వాహనాల్లో ఇంటింటికి బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం చెప్పినట్లుగా దసరా కానుకగా నిత్యవసర సరుకులను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. గత మూడు నెలలుగా బియ్యం వేయని లబ్ధిదారులను గుర్తించి అర్హులైన వారికి బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు .ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర నాయకులు వెంకటనారాయణ, ప్రకాష్, మసూద్ ,వలీ, రాజు, జీవా, ఎన్టీఆర్ సీన, వెంకటేష్ ,అంజి, దేవిడ్ , రవి, భాష,రామాంజనేయులు, నాగేంద్ర, కుమారి, శంషాద్, దస్తగిరమ్మ, మోహన్, సీనా లాలు ,లాలెమ్మ, పక్రుణ్ణి తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన సంతానం





**నార్పల-సూర్య వాస్తవం:**

గర్భవతులు బాలింతలు ఆరోగ్యకరమైన సంతానం కావాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. గురువారం నార్పల ప్రాజెక్టు పరిధిలోని మండల కేంద్రమైన నార్పల గ్రామంలోని ఉయ్యాలకుంట -2 అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం వారోత్సవాలు అంగన్వాడీ కార్యకర్త డొక్కా శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులకు బాలింతలకు రక్తహీనత గురించి బిడ్డకు రెండు సంవత్సరాలు వచ్చే వరకు తల్లిపాలు కొనసాగించాలన్నారు.అనుబంధ ఆహారంతో పాటు పాలు, బాలామృతము, గుడ్లు పెట్టాలన్నారు. అనారోగ్యం గురి కాకుండా పౌష్టిక ఆహారం బిడ్డకు పెట్టాలని తల్లులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు డి. శ్రీదేవి ,డి. భారతి, రామాంజినమ్మ లలితమ్మ ,వెంకటలక్ష్మి గుల్జాలబాను తదితరులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, GSTIN : 37AAJF15233N1ZY, TEL: 7672042522.VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG CELL : 918500425222 (FOUNDER -N.ARIF ALI )